RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 10 ఏప్రిల్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:262

## అమెరికా-ఇరాన్ ఒప్పందంపై గందరగోళం.. పాక్ మధ్యవర్తిత్వంపై నీలినీడలు!



అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావించిన అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ చేసిన మధ్యవర్తిత్వంతో రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. అయితే, ఈ ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చడంపై పాకిస్థాన్, అమెరికా పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడంతో చర్చలకు ముందే దౌత్యపరమైన వివాదం రాజుకుంది.

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, "ఇరాన్, అమెరికా సహా వాటి మిత్రదేశాల మధ్య లెబనాన్‌తో సహా అన్నిచోట్లా తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది" అని ప్రకటించారు. శనివారం నుంచి ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల ప్రతినిధులు చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు.

అయితే, షెహబాజ్ షరీఫ్ ప్రకటన చేసిన కొద్దిసేపటికే అమెరికా, ఇజ్రాయెల్ వర్గాలు దీనిని ఖండించాయి. ఈ ఒప్పందం కేవలం ఇరాన్‌కు మాత్రమే పరిమితమని, ఇందులో లెబనాన్ ప్రస్తావనే లేదని స్పష్టం చేశాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, "కాల్పుల విరమణలో లెబనాన్ కూడా ఉందని ఇరాన్ భావించి ఉండవచ్చు, కానీ అది వాస్తవం కాదు. మేం అలాంటి హామీ ఎప్పుడూ ఇవ్వలేదు" అని తేల్చిచెప్పారు.

ఈ విరుద్ధ ప్రకటనలతో పాకిస్థాన్ మధ్యవర్తిత్వ పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్ ఇరు దేశాలకు వేర్వేరు హామీలు ఇచ్చిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ హత్య తర్వాత ఫిబ్రవరి 28 నుంచి పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కాల్పుల విరమణకు పాక్ చొరవ తీసుకుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి పాక్ ప్రయత్నాలను అభినందించినప్పటికీ, తమ మిత్రపక్షాలపై దాడులు కొనసాగితే ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ గందరగోళం నడుమ, ఏప్రిల్ 10న ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరగనున్నాయి. చర్చలకు ముందే వాతావరణం దెబ్బతినడంతో ఈ సమావేశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పాకిస్థాన్ ప్రభుత్వం మాత్రం ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది.

## జూన్ 2 నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం



హైద్రాబాద్ ఏప్రిల్ 9:: జూన్ 2వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు Dy.CM భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు వివరించారు. అలాగే 100 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తామని చెప్పారు. అంతరాలు లేని, ఆదర్శ సమాజం విద్య ద్వారానే సాధ్యమని వివరించారు.

## జీవన్ రెడ్డిపై..టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అసహనం



హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీకి కొన్నిరోజుల క్రితం రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ముఖ్యమంత్రిపై విమర్శలు జీవన్ రెడ్డికి సరికాదని అన్నారు. ఎమ్మెల్యేలందరూ కలిసి ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు.నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఇప్పుడు చేపడుతున్న పద్ధతికి తాము వ్యతిరేకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనాభా ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణ భారతదేశం నష్టపోతుందని అన్నారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగకూడదనే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పార్టీలు కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చేస్తున్న విమర్శలకు ఆధారాలు ఉంటే హరీశ్ రావు చూపించాలని డిమాండ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు.

## 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం... మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు



పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 13 ఏళ్లలోపు చిన్నారులను సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉంచేందుకు వీలుగా ఒక ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలో మంత్రుల బృందం, ఉన్నతాధికారులు, మెటా, యూట్యూబ్ వంటి ప్రముఖ సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతినకుండా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 13 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు వారి వయసుకు తగిన కంటెంట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచేలా విధివిధానాలు రూపొందించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా మహిళల పట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిల్లల డిజిటల్ భద్రతకు సంబంధించి ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు లోకేశ్ సూచించారు. వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్‌తో అనుసంధానించిన 'ఏజ్ టోకెన్' విధానంపై దృష్టి సారించాలని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' రోజున విద్యార్థులకు, పీటీఎం సమావేశాల్లో తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు... సున్నితమైన కంటెంట్‌ను పిల్లలకు దూరంగా ఉంచేందుకు తాము తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యాచరణకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్.. మొదలైన అనర్హుల ఏరివేత

వార్తా 2 లో

## జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ లో సముచిత స్థానం వుంటుంది కేటీఆర్

### ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరిక జీవన్ రెడ్డి



జగిత్యాల మాజీ మంత్రి జీవన్ రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డి ని కేసీఆర్ సూచన మేరకు మా సహచరులందరితో కలిసి సాదరంగా ఆహ్వానించేందుకు వచ్చాం. 2014 ఎన్నికలకు ముందే కేసీఆర్ జీవన్ రెడ్డిని ఆహ్వానించారు. కానీ, నిబద్ధత గల నాయకుడిగా ఆయన కాంగ్రెస్ తోనే కొనసాగారని అన్నారు.

కేసీఆర్, జీవన్ రెడ్డి బంధం ఈనాటిది కాదు. జూన్ 2, 2014లో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టాక మొట్టమొదటి సారి జగిత్యాలకు వచ్చారు. ఆరోజు బోర్నపల్లి బ్రిడ్జి గురించి జీవన్ రెడ్డి కేసీఆర్ ను అడిగారు. ఆయనడిగిందే తడవుగా కరీంనగర్ జిల్లాలో మొట్టమొదటి సాంక్షన్ ఇచ్చారు. షుగర్ ఫ్యాక్టరీపై జీవన్ రెడ్డి ఫైట్ చేశారు. ఆ క్రమంలోనే కేసీఆర్ మహారాష్ట్ర తరహా కో ఆపరేటివ్ సొసైటీ పద్ధతిలో పెడదామన్నారు. పార్టీ బలోపేతానికి జీవన్ రెడ్డి చేరిక బాగుంటుందని జగిత్యాల నాయకత్వం కూడా మద్దతు తెలిపిందని అన్నారు.

కాలం నెట్టుకొచ్చే ప్రభుత్వం ఇది. మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. 70 లక్షల కోట్లు రైతులకు బకాయి పడ్డారు. బాసరలో ముఖ్యమంత్రి భాష అసహ్యంగా ఉంది. నిఖార్సైన జీవన్ రెడ్డి వంటి నేతలను అవమానపరుస్తోంది ఈ కాంగ్రెస్ . నేను భట్టి ఇంటికి పెళ్లికి పోయినప్పుడు కూడా వంద మంది రాబోయేది మీ ప్రభుత్వమేనన్నారు. సీఆర్ ను కూడా కలిసి తన నిర్ణయం ప్రకటిస్తామన్నారు జీవన్ రెడ్డి . జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని అయన స్పష్టం చేసారు.

జీవన్ రెడ్డి మాట్లాడూ కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ మా ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారు. హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ నుంచి రాజీనామా భావోద్వేగానికి గురి చేసింది. ఇవాళ బీఆర్ఎస్ తో కలవడం సంతోషంగా ఉంది. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టా. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉంది. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం సంతోషంగా ఉందని అన్నారు.

## విద్యార్దులకు ఉచిత సైకిళ్ల పంపిణీ పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి



మధిర అక్షరమే ఆయుధంగా తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీ పడేలా ఎదగాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం మధిర నియోజకవర్గంలోని బోనకల్లులో అమ్మ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అయన పంపిణీ చేసారు.

ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా పాఠశాలకు చేరుకునేలా, వారి విద్యాభ్యాసానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ముఖ్యంగా బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ, వారి భవిష్యత్తును మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అంతరాలు లేని ఆదర్శ సమాజం కేవలం విద్యతోనే సాధ్యం. అందుకే రాష్ట్రంలో ఒకేసారి 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అలాగే ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని అన్నారు.

పేద బిడ్డలు ఆకలితో చదువుకు దూరం కాకూడదని జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నాం. విద్యా రంగంలో మేము పెట్టే ప్రతి రూపాయి రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం చేసే గొప్ప పెట్టుబడని అన్నారు..

# ప్రజాబలం

10 ఏప్రిల్ 2026 శుక్రవారం


# డబుల్ బెడ్ రూమ్ పట్టాలు పంపిణీ చేసిన మంత్రి పొన్నం

హైదరాబాద్ కార్వాన్ ఎంకే ఎ కన్వెన్షన్ హాల్ లో బహదూర్ పుర ,కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 2బీహెచ్కే పట్టాలు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేపారు మంత్రి మాట్లాడు”హ డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. గతంలో చాలా సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూం లు అడిగారు.. మిగిలిపోయిన పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం లు అందిస్తున్నాం. మిగిలిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేస్తాం. గత 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశాం..ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎప్పుడైనా రేషన్ కార్డులు పంపిణీ జరుగుతాయి.. ఇది నిరంతర ప్రక్రియ. రేషన్ కార్డులు మాత్రమే కాకుండా తినడానికి యోగ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఆర్థికంగా ప్రజల మీద భారం పడకుండా ఉచిత కరెంట్ తో పాటు ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఇప్పటి వరకు 300 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారు. మహిళలంతా మెప్మా సంఘాల్లో చేరాలి. ప్రభుత్వం మహిళా సంఘాలకు వేల కోట్లు లోన్లు ఇస్తుంది. హైదరాబాద్ లో గ్రామీణ ప్రాంతాల్లో కంటే మహిళా సంఘాల సభ్యులు తక్కువ ప్రతి ఒకరు మహిళా సంఘం లో చేరాలి.. వారికి లోన్లు ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో పల్లెటూరు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం..5 లక్షల రూపాయలు అందిస్తున్నాం. త్వరలో హైదరాబాద్ లో స్థలం ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో సమావేశం ఏర్పాటు చేశాం. స్లమ్స్ అభివృద్ధి చేసి స్థల సేకరణ చేసి ఇందిరమ్మ ఇళ్లు కడతాం. హైదరాబాద్ లో స్థలాలు ఇబ్బంది ఉంది దానికి కార్యాచరణ తీసుకున్నాం.. త్వరలోనే వారికి ఇల్లు ఇస్తాం. కొత్తగా 70 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. అర్హత ఉన్న వారందరికీ ఎలాంటి వివక్ష లేకుండా డబుల్ బెడ్ రూం పట్టాలు అందిస్తున్నాం. ఎక్కడైనా పొరపాటు జరిగితే మా దృష్టికి తీసుకురండి .. పారదర్శకంగా డబుల్ బెడ్ రూం పట్టాలు అందించబడుతుందని అన్నారు.

# మతమా... విశ్వాసమా....

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ కొనసాగుతోంది.'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది.న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసిందిసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్? నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్? బి.వి. నాగరత్న, జస్టిస్? ఎం.ఎం. సుందరేశ్?, జస్టిస్? అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్? అరవింద్? కుమార్?, జస్టిస్? అగస్టిన్? జార్జ్? మాసిహ్?, జస్టిస్? ప్రసన్న బి.వరాలే, జస్టిస్? ఆర్? మహదేవన్?, జస్టిస్? జోయ్? మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ విచారణ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్‌లు బీవీ నాగరత్నం, ఎంఎం సుందరేష్, అహసానుద్దీన్ అమానుల్లా సహా తొమ్మిది మంది న్యాయమూర్తులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు బలంగా వినిపించారు. శబరిమల ఆలయానికి సంబంధించి మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా మతపరమైన విశ్వాసాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛను ప్రస్తావిస్తూ మతపరమైన ఆచారాలు ప్రజలకు భావాలకు, నైతికత, ఆరోగ్యం, వంటి అంశాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని ఆయన వాదించారు. మతపరమైన గ్రంథాలను అర్థం చేసుకోవడం, అవి ఏవీ నిర్దేశిస్తున్నయో నిర్ణయించడం న్యాయసమీక్ష పరిధిలోకి రాదని, దీనికి ఆధ్యాత్మిక మతపరమైన ఆచారం అనేది నిర్ణయించడానికి న్యాయస్థానాలు ప్రయత్నించడం సరైనది కాదని ఆయన వాదించారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్? మెహతా, “ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్?)? మాత్రమే సంస్కరణ (రిఫార్మ్? లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి” అని పేర్కొన్నారు.2018 నాటి శబరిమల తీర్పులో మహిళల ప్రవేశానికి అస్పృశ్యత కిందకు వస్తుందని అప్పటి ధర్మాసనం చేసిన వ్యాఖ్యలపై తుషార్ మెహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ, ఒక మహిళను నెలలో మూడు రోజులు అంటరాని వ్యక్తిగా చూసి, నాలుగో రోజు ఆమె అస్పృశ్యురాలు కాదని చెప్పడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. అయితే మెహతా దీనికి సమాధానం ఇస్తూ శబరిమల విషయంలో ఆంక్షలు కేవలం వయసు ఆధారంగానే ఉన్నాయని, ఇది రుతక్రమంతో ముడిపడి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇతర అయ్యప్పస్వామి దేవాలయాల్లో ఇన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉందని, శబరిమల విషయంలో ఉన్న ఆంక్షలు ఒక ప్రత్యేక సందర్భం అని ఆయన వివరించారు. ఒక వేళ ఏదైనా అశాస్త్రీయమైన ఆచారం ఉంటే, దానిని పరిష్కరించే బాధ్యత శాసనసభలకే ఉంటుందని కేంద్రం వాదించింది. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, న్యాయస్థానాలు సైన్స్ రంగంలో నిపుణులు కాకపోయినప్పటికీ, ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం నిపుణులు అభిప్రాయాలను సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒక సామాజిక రుగ్మతను మతపరమైన ఆచారంగా ముద్రవేసినప్పుడు అది నిజంగా మతపరమైన అచారామా లేక సామాజిక దురాచారమా అని చెప్పే హక్కు కోర్టుకు ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీయ సమాజం మహిళలను ఎప్పుడూ గౌరప్రదమైన స్థానంలో ఉంచిందని, మనం దేవతలను పూజిస్తామని మెహతా ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు మహిళలు అత్యున్నత పదవులను అలంకరించారని, కాబట్టి ఇక్కడ పితృస్వామ్య భావజాలాన్ని ఆపాదించవద్దని ఆయన కోరారు. 2018 సెప్టెంబర్?లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్? 14న అప్పటి సీజేఐ రంజన్? గొగోయ్? నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది.ఈ విచారణలో సుప్రీంకోర్టు కేవలం శబరిమల తీర్పు మెరిట్‌లను మాత్రమే కాకుండా, మతపరమైన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి రూపొందించిన ఏడు కీలక ప్రశ్నలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేసింది.

# రేషన్ కార్డుదారులకు బిగ్ అలర్ట్.. మొదలైన అనర్హుల ఏరివేత



హైద్రాబాద్ ఏప్రిల్ 9:రాష్ట్రంలో ఆదాయ పన్ను చెల్లించేవారి ఆహార భద్రత కార్డులను తొలగించేందుకు కేంద్రం సిద్ధమైంది. లబ్ధిదారుల ఆధార్, పాన్కార్డు వివరాలను ఆదాయ పన్నుశాఖ ద్వారా సేకరించి, వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించి కార్డులను కట్ చేయనుంది.

ఖరీదైన వాహనాలు కలిగివున్న వారి రేషన్ కూడాబంద్కానుంది. 83,545 మంది మరణించిన వారికి రేషన్పంపిణీ జరుగుతుండగా.. నిబంధనలకు విరుద్ధంగా రూ.135 కోట్లు ఖర్చు అవుతోంది. పీఎం కిసాన్డేటా ఆధారంగా 52,339 మంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నట్టు తేలింది. 5866 మందికి 15 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉండగా రైతు భరోసా ద్వారా ఏటా వీరికి 1.50 లక్షల ఆదాయం మించింది. రాష్ట్రంలో రేషన్కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరుకోగా అందులో ఆహార భద్రత కార్డుల కింద కేంద్రం 99.36 లక్షల కార్డులు మంజూరు చేసి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఏటా లక్షల రూపాయలు ఐటీ చెల్లిస్తూ తాము పేదలమని చాలామంది నెలవారీగా ఉచిత బియ్యం తీసుకుంటున్నానే గత రెండేళ్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి.

పేదల ముసుగులో

రేషన్కార్డు పొందేందుకు ఏడాదికి పట్టణాల్లో రూ.2 లక్షల ఆదాయం, గ్రామాల్లో రూ.1.50 లక్షల ఆదాయంలోపు ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ అందుకు విరుద్ధంగా నెలకు లక్ష రూపాయలు ఆదాయం వచ్చే కుటుంబాలు కూడా నిరుపేదల కింద రేషన్కార్డులు తీసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వీరంతా రేషన్బియ్యం తినకుండా బ్లాక్మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్టు బయటపడింది. ప్రభుత్వం ఎన్ని కఠిన నిబంధనలు తీసుకొచ్చిన పీడీఎస్రైస్‌నుదర్జాగా పక్కదారి పట్టిస్తున్నారు. ధనవంతులు ప్రభుత్వ రూల్స్పాటించకుండా పేద కుటుంబాల ముసుగులో నిజమైన లబ్దిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, రుణాలను కాజేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేషన్ మాఫియా

తెలంగాణలో రేషన్కార్డు కలిగివున్న దాదాపు 8 లక్షలకుపైగా కుటుంబాలకు ఏటా రూ.25 లక్షల ఆదాయం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిపై స్థానికంగా ఉండే విపక్ష పార్టీల నేతలు ఫిర్యాదులు చేశారు. వీరంతా ఏటా దాదాపుగా 1.50 లక్షల మెట్రిక్టన్నుల ఉచిత బియ్యం తీసుకుని రేషన్మాఫియాకు ఇస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. ఇంతటితో ఆగకుండా ఆయా సంక్షేమ శాఖలో పలు పథకాలు పొందడంతో పాటు, పిల్లల చదువుల కోసం రుణం తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకోవడంలో ముందు వరుసలో ఉన్నారు. రేషన్బియ్యంతో వచ్చే ఆదాయంతో పాటు ప్రభుత్వ పథకాలు అప్పన్నంగా పొందినట్లు ఆరోపణలున్నాయి.బి

అధికారుల నిర్లక్ష్యం

బీఆర్ఎస్పాలనలో అడ్డగోలుగా కార్డులు మంజూరు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ప్రభుత్వంలో కూడా కోటీశ్వరులు రేషన్కార్డులను దర్జాగా పొందారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారి ఇంటింటికి వెళ్లి పరిశీలిన చేసిన మండలంలోని అధికారులు ముడుపులు ముట్టగానే చేతులు దులుపుకున్నట్లు తేలింది. ఇటీవలే కేంద్ర ఆహార, పంపిణీ శాఖ సహాయ మంత్రి పార్లమెంటులో తెలంగాణ రాష్ట్రంలో 1.40 లక్షల రేషన్కార్డులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. కేంద్రం గుర్తించిన జాబితాను ఇప్పటికే తెలంగాణ పౌరసరఫరాల శాఖకు పంపినట్లు తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందిన వారికి నోటీసులు జారీ చేసి, ఎందుకు తొలగిస్తున్నారో కూడా వివరించాలని పేర్కొంది.దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారులు ఆ దిశగానే చర్యలకు సిద్ధమవుతున్నారు..

# రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలి

**సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్. బి. సుదర్శన్ రెడ్డి?**

**“ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం : విభేదాలు, భవిష్యత్ దిశ” అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభం?**

అంబేద్కర్ వర్సిటీలో కొనసాగుతున్న సామాజిక సాధికార ఉత్సవాలుహైదరాబాద్, ఏప్రిల్ 9, 2026: రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ, అర్థశాస్త్ర విభాగం, చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న “ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం : విభేదాలు, భవిష్యత్ దిశ” అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డా. బి. ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి మాత్రమే కాకుండా ఆయన ఓ విశిష్ట ఆర్థికవేత్త కూడా అని పేర్కొన్నారు. సామ్యవాద స్ఫూర్తి రాజ్యాంగంలో అంతర్లీనంగా నిక్షిప్తమై ఉందని, ముఖ్యంగా సమానత్వం, న్యాయంపై పీఠిక ఇచ్చిన ప్రాధాన్యతలో ఇది ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని కూడా సాధించాల్సిన ప్రాముఖ్యత ఉందన్నారు. 1946 నాటి కరాచీ తీర్మానాన్ని ప్రస్తావిస్తూ, అది భారతదేశంలో సామాజిక-ఆర్థిక హక్కులకు పునాది వేసిందన్నారు. కాలక్రమేణా అనేక రాజ్యాంగ సవరణలు ఆర్థిక పరమైన ఆందోళనలను పరిష్కరించాయని ప్రస్తావించారు. 1951 నాటి జవహర్ లాల్ నెహ్రూ ఆలోచనలను ఉటంకిస్తూ, నేటి సవాళ్లను తొలితరం నాయకులు ముందే ఊహించారని వెల్లడించారు. జమీందారీ వ్యవస్థ రద్దు, వ్యవసాయ పోరాటాలు, సమానత్వం దిశగా కీలకమైన అడుగులని పేర్కొన్నారు. ఫాసిజం కొత్త రూపాల పెరుగుదల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.




# ఉచిత విద్యుత్ కోసం చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి

విజయవాడ లో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలుపై విద్యుత్, చేనేత మరియు జౌళి శాఖాధికారులతోమంత్రి సవిత గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. . ఏప్రిల్ 1వ తేదీ నుండి చేనేత మరియు పవర్ లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు: నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పవర్ లూమ్ (మగ్గం) కార్మికులకు: నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం బడ్జెట్ఈ పథకం కోసం సుమారు 150 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. అర్హులైన కార్మికులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

### మలుం గుమ్మి జలపాతంలో విషాదం
### ముగ్గురు విద్యార్థులు జల సమాధి
### ఘటనా స్థలంలో కొనసాగుతున్న పోలీస్, వైద్య శాఖల పంచనామా?

అనంతగిరి, ఏప్రిల్ 9: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని మలుం గుమ్మి జలపాతం వద్ద గురువారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడుపుదామని వచ్చిన నలుగురు విద్యార్థినుల్లో ముగ్గురు నీటిలో మునిగి మృతి చెందగా, ఒకరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.హుకుంపేట మండలం బుర్జ పంచాయతీ జంబువలస గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థినులు ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మలుం గుమ్మి జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లారు. నీటిలోకి దిగిన సమయంలో లోతు తెలియకపోవడంతో నలుగురు ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు వెంటనే స్పందించి ఒకరిని కాపాడగలిగినప్పటికీ, మిగిలిన ముగ్గురు అప్పటికే మృతి చెందారు. మృతులంతా ఎస్టీ కొండదొర కులానికి చెందిన వారు.?పోలీస్ మరియు వైద్య శాఖల ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీస్ మరియు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం మృతదేహాలకు అధికారులు పంచనామా నిర్వహిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతుండగా, వైద్య బృందం తమ విధుల్లో నిమగ్నమయ్యారు.

# రాష్ట్రంలో పెరిగిపోతున్న భూకబ్జాలు

## ప్రధాని కలిసి సిబిఐ విచారణ జరిపిస్తాం.

## రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య



హైద్రాబాద్ ఏప్రిల్ 9;రాష్ట్రంలో భూకబ్జాలు - అవినీతి విచ్చలవిడిగా హద్దు పద్దు లేకుండా పెరిగిపోయింది. దీనిని అరికట్టవలసిన ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. పైగా ప్రభుత్వ అధినేతలే అక్రమాలకు పాల్పడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ నేతలు - టిఆర్ఎస్ నేతలపై మంత్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రాజకీయ నాయకులు ముఖ్యంగా పదవులలో ఉన్న మంత్రులు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల అక్రమాస్తులపై వారి హయంలో జరిగిన అధికారం దుర్వినియోగం - అవినీతి అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇంత అవినీతి జరుగుతున్న కొందరు మంత్రులు కొందరు అధికారులు వేల లక్షల కోట్లు అక్రమా ఆస్తులు సంపాదిస్తున్న రాజకీయ పార్టీలు -- ప్రతిపక్షలు ప్రత్యేక్ష పాత్ర పోషిస్తున్నారు తప్ప దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరడంలేదు. అందుకే త్వరలో ప్రధానమంత్రిని కలిసి సిబిఐ విచారణ కోరన్నట్లు కృష్ణయ్య తెలిపారు. ఇంత అవినీతి పాలన అక్రమ పాలన ప్రజలను పట్టించుకొని ప్రభుత్వాలను నా 50 సంవత్సరాల ఉద్యమ కాలంలో చూడలేదన్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో నలుగురు మంత్రులు, కొందరు ఐఏఎస్ అధికారులు కలెక్టర్లు కుమ్మక్కై రాష్ట్రాన్ని లూటి చేస్తున్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమ గాలికి వదిలేసారు. గత 13 సంవత్సరాల లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలి. ధనిక రాష్ట్రం - మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం నేడు 10 లక్షల కోట్లకు పైగా అప్పుల పాలయింది. విచిత్ర ఏమిటంటే ఈ దోపిడీ దొంగలు భూమి ఆస్తులు కాజేయడమే గాక తెచ్చిన అప్పులతో కూడా కాంట్రాక్టర్ల పేరు మీద కోట్లు కొల్లగడుగుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అదోగతి పాల్జేశారు. ప్రజల అభివృద్ధి -- సంక్షేమాన్ని గాలికి వదిలేశారు.విద్యార్థులకు ఫీజులు -- స్కాలర్ షిప్ లు ఇవ్వడం లేదు. అంతేకాదు బి.సి హాస్టళ్ళు -- గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించడం లేదు.

ప్రభుత్వ స్థలాలు -- ప్రజల ఆస్తులు వీటిని ప్రజా అవసరాలకు, పేదల ఇండ్లు కట్టడానికి ప్రభుత్వ ఆఫీసులకు హాస్టళ్ళకు, స్కూల్ కు నిర్మాణానికి ఉపయోగించాలి. అంతే గాని కబ్జాలు చేయడానికి అమ్మడానికి కాదు. ఇప్పుడు అమ్మితే కబ్జాలు భావితరాలకు ఏమి ఉంటుందని ప్రశించారు. గతంలో కూడా ప్రభుత్వాలు అమ్మడానికి ప్రయత్నం చేశారు. అప్పుడు మేము గట్టిగా వ్యతిరేకించడంతో అమ్మడాని ఆపేశారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ భూమి అమ్మడం ఆపేయాలి. ప్రభుత్వ స్థలాలను వేలం వేయరాదు. ఇది బీసీ కాలేజీ హాస్టళ్ళు, బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించడానికి ఇళ్ళు లేని పేదలకు పంచడానికి, అడవులు పెంచడానికి వాతావరణం కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది బీసీ/ఎస్సి/ఎస్టి కాలేజీ హాస్టళ్ళు, బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలు, నిర్మించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాలలో చాలీ-చాలని వసతులతో విద్యార్థులు కిక్కిరిసి యున్నారు. హాస్టల్ గదులు కిక్కిరిసిపోయాయి. 5మంది విద్యార్థులు యుండవలసిన గదులలో 20 నుంచి 30 మంది ఉంటున్నారు. కొత్త బిల్డింగులు తీసుకోవడం లేదు. ఒకే భవనంలో 3 హాస్టళ్ళను నడుపుతున్నారు. విద్యార్థుల సౌకర్యం కల్పించాలనే కోణంలో చూడకుండ ప్రభుత్వానికి డబ్బు ఎలా మిగిల్చాలని అధికారులు చూస్తున్నారు. దీని వలన విద్యార్థులు ఆరోగ్యం దెబ్బతింటుంది. చదువు దెబ్బతింటుంది. జాతి సంపద దెబ్బ తింటుంది. పైగా ఏటా అద్దె కింద కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. కావున అన్ని వసతులతో స్వంత భవనాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు పంచాలని కోరారు. హాస్టళ్లకు, గురుకులాలకు ఇచ్చిన తరువాత అమ్మకాలకు పోవాలన్నారు. ఇంకొక వైపు నగరాలలో చెట్లు పెంపకం లేక వాతావరణ కాలుష్యం పెరిగిపోతుంది. కబ్జా దారుల నుండి భూములను కాపాడుకోవాల్సిన అవసరంయుంది.

ఒకవైపు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను వేలం వేస్తూ మంత్రులు కబ్జా దొరలకు వందల కోట్ల రూపాయలకు అమ్ముకుంటూ ఉన్నారు. ప్రభుత్వ స్థలాలు ఇల్లు లేని పేద ప్రజలకు కేటాయించాలి. కానీ వేలం వేయడం - అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదు. ప్రభుత్వ స్థలాలు అమ్మ రాదని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ తిరుగుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొందరు రెవెన్యు అధికారులు పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు కేటాయించి రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కయి. కోట్ల రూపాయలు అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారన్నారు. త్వరలో ప్రధానమంత్రిని సిబిఐ విచారణకు డిమాండ్ చేస్తున్నాం.

హైదరాబాద్ మహానగరంలో 6 లక్షల మంది పేద ప్రజలు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన చెందిన పేద ప్రజలు ఇంటి అద్దాలు చెల్లించలేక బ్రతుకు భారమై జీవిస్తుంటే ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు అమ్ముకుంటూ రాష్ట్రాన్ని దోపిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రమాదాల నివారణకు చర్యలు వేగవంతం

## ఏప్రిల్ 13--18 'అరైవ్-అలైవ్' వారోత్సవం

## ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యం: 'అరైవ్-అలైవ్' కార్యక్రమంపై సీఎస్ సమీక్ష

## రోడ్డు భద్రతపై అవగాహనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్






**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 09:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై తగిన చర్యలను చేపడుతున్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆయన తెలిపారు. వాహనాల సంఖ్య పెరగడం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడమే ఈ ప్రమాదాలకు కారణమని ఆయన పేర్కొన్నారు.

దీనిపై జిల్లా కలెక్టర్లు రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలను కనుగోనాలని ఆయన ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తక్షణమే నిర్వహించి, వారాంతర "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించబడుతుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజల ప్రాణాలను రక్షించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సిఎస్ పేర్కొన్నారు.

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సాధారణ కార్యక్రమం కాదని, ఇది పలు శాఖల సమన్వయంతో కూడిన సమగ్ర చర్య అని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు , ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు కూడా తెలిపారు.

కార్యక్రమ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి:

- ఏప్రిల్ 13: గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు.
- ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణం చేయించడం.
- ఏప్రిల్ 15: "చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే" -- నాలుగేళ్లకు పైబడిన పిల్లలకు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు.
- ఏప్రిల్ 16: ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు -- హెల్మెట్ , సీట్ బెల్ట్ వినియోగాన్ని ప్రోత్సహించడం, అలాగే సోషల్ మీడియాలో అవగాహన సందేశాలు, ఫోటోలు పంచుకోవడం.
- ఏప్రిల్ 17: ప్రమాదాల అనంతరం తక్షణ సహాయం మెరుగుపరచడానికి "గోల్డెన్ అవర్" అత్యవసర స్పందన శిక్షణ కార్యక్రమాలు.
- ఏప్రిల్ 18: ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు -- ప్రవర్తనా మార్పు, ట్రాఫిక్ నియమాల పాటించడంపై దృష్టి.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, సిఐపిఆర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు మరియు పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మను చౌదరి కూకట్పల్లి ఎమ్మార్వో కార్యాలయం నుండి ఈ వీడియో కాన్ఫరెన్సో హాజరైనారు.

# ఇందిరమ్మ ఇంట్లో ఉన్న పోల్, కరెంటు తీగల తొలగింపు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలిపిన బింగి రేణుక



**ప్రజాబలం ప్రతినిధి (వేములాడ ఏప్రిల్ -09 )**వేములవాడ పట్టణంలోని కోరుట్ల రోడ్ భీమేశ్వర గార్డెన్ సమీపంలో ప్రమాదకరంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కరెంటు పోలు, తీగల వల్ల ప్రమాదకరంగా మారింది లబ్ధిదారురాలు బింగి రేణుకకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి పైనుండి విద్యుత్ లైన్ వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. వెంటనే సమస్య పరిష్కారం కోసం రేణుక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశించారు. గురువారం టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు ప్రమాదకర విద్యుత్ లైన్‌ను, పోలును తొలగించడంతో ఇంటి నిర్మాణానికి ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో లబ్ధిదారురాలు రేణుక ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను పరిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, వార్డు కౌన్సిలర్ సంగీత- శ్రీకాంత్ కు ఎంపీడీసీఎల్ ఏడికి, ఏఈకి బింగి రేణుక కృతజ్ఞతలు తెలిపారు.

# శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేశ్వరి సస్పెండ్

## మరో ముగ్గురు శానిటరీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసుల జారీ

## విధుల్లో నిర్లక్ష్యం సహించం: కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంపై శానిటరీ ఇన్స్పెక్టర్ సస్పెండ్, ముగ్గురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను గురువారం కమిషనర్ మయూర్ అశోక్ జారీ చేశారు.గుంటూరు నగర ప్రజారోగ్య రక్షణలో కీలకమైన పారిశుధ్య నిర్వహణలో అధికారులు, కార్యదర్శుల నిర్లక్ష్యాన్ని సహించబోమని కమిషనర్ హెచ్చరించారు. బాలాజీ నగర్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనుల తీరును పరిశీలించి, పారిశుధ్య పనులు సక్రమంగా జరగకపోవడంపై 3 వార్డ్ శానిటరీ ఇన్స్పెక్టర్ (ఇంచార్జి) బి.రాజేశ్వరిని విధుల నుండి సస్పెండ్, 16, 18, 19 సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు సాగర్, ఏసమ్మ, హనుమాన్ సింగ్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఎంఓహెచ్ ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో ప్రజలు సంతృప్తి చెందేలా, పనితీరు మెరుగుపరుచుకోవాలని ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శుల పనితీరులో ఆశించిన మార్పు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాజీ నగర్ రాజీవ్ గృహకల్ప మెయిన్ రోడ్ చెత్త కుప్పలు, డ్రైన్ లో మురుగు పారుదల లేకుండా ఉండడం, సచివాలయ కార్యదర్శులు పిన్ పాయింట్ ప్రోగ్రాం ప్రకారం క్షేత్ర స్థాయిలో పనులు చేయించకపోవడం, డివిజన్ లో బాధ్యతాయుతంగా పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేయడంలో ఇన్స్పెక్టర్ నిర్లక్ష్యంపై ఇన్స్పెక్టర్ ని విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ముగ్గురు శానిటరీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు.

# నూతన కాలనీలకు మంచి నీరు అందించండి

## జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్ చెరు నియోజకవర్గం లోని జలమండలి పరిధిలో గల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మి కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని, రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి విఅతి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు.

# పెనుబర్తిలో సూర్యాఘర్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు గురువారం ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పెనుబర్తి గ్రామం చెర్లో ఎస్.టి. సంఘంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేసారు.

ఎమ్మెల్యేశ్రీధర్ రెడ్డి మాట్లాడూతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపుగా 3 వేల మందికి 36 కోట్ల రూపాయల నిధులతో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టాం.?? పెనుబర్తి, కలివెలపాలెం, మాదరాజుగూడూరు, కాకుపల్లి గ్రామాల ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ఆ సమస్యలను పరిష్కరించే దానికి స్థానిక శాసనసభ్యుడిగా సిద్ధంగా ఉంటా. ?? 3 ఫేజ్ కరెంటు పనులు 100 శాతం పనులు పూర్తిచేసి నెల్లూరు జిల్లాలోనే నెల్లూరు రూరల్ ప్రథమస్థానం మని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు బూడిద విజయ్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షులు పల్లంరెడ్డి రవీంద్ర రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సారంగం గున్నయ్య, నెల్లూరు ట్యాంక్ సప్లై డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మెన్ ఏలూరు శివయ్య నాయుడు, టీడీపీ నాయకులు పల్లంరెడ్డి భాస్కర్ రెడ్డి, చిరమన శ్రీనివాసులు రెడ్డి, జానాబత్తిన రవి, సుమంత్ రెడ్డి, జస్వంత్ రెడ్డి, ఏలూరు శీనయ్య నాయుడు, అలగల మల్లికార్జున, చిట్టేటి రవీంద్ర రెడ్డి, తుమ్మతాటి రవి, తాండ్ర పెంచలయ్య, తాండ్ర నాగేంద్ర, జి. మనోహర్, షేక్ సుభాన్ జాన్, జి. అంకయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలి

## - జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: ఏప్రిల్ 9 నర్సరీలోని ప్రతి మొక్కను సంరక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో, స్తంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు.నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు, వాటి జీవన శాతం ఎలా ఉంది, భవిష్యత్తులో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి కాలం అయినందున ఎండ తీవ్రత దృష్ట్యా నర్సరీలలో షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, సమయం ప్రకారం మొక్కలకు నీరందించాలని, సమయానుకూలంగా ఎరువులు వేసి మొక్కల ఎదుగుదలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో 100 మంది ఈజిఎస్ ఉపాధి హామీ కూలీలతో నర్సరీలలోని మొక్కలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షించాలని అలాగే పూలు, పండ్లు, ఇతర నీడ నిచ్చే మొక్కల పెంపకం కీలకమని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచి సమయానికి నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి జీవన శాతాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో పీడీ రఘువరన్, తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీ ఓ,స్థానిక సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో మినీ ఢిల్లీ

విజయవాడ, ఏప్రిల్ 9,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి మారనున్నాయి. ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్ , విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనుల శాఖ పర్యవేక్షించనుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ. మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

ప్రాజెక్టు అంచనా వ్యయం:
సెంట్రల్ సెక్రటేరియట్: రూ. 1,299.08 కోట్లు.
ఉద్యోగుల నివాస సముదాయాలు: రూ. 1,234.91 కోట్లు.

నిర్మాణ విస్తీర్ణం:
ఈ భారీ ప్రాజెక్టు కోసం ఏపీ సీఆర్‌డీఏ ఇప్పటికే 22.53 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సచివాలయ భవనం, మిగిలిన 17 ఎకరాల్లో కేంద్ర ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల నివాస భవనాలను నిర్మించనున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఆమోదం తెలిపారు.

ప్రముఖుల చొరవ:
ఈ ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పర్యవేక్షించారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో మరో 10 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హుడ్‌కోవెల్లడించింది. దీనివల్ల అమరావతిలో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకు మార్గం సుగమం కానుంది.

# మామిడి రైతులపై యుద్ధ ప్రభావం

విజయవాడ, ఏప్రిల్ 9, భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధారపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులనుగ్రాృంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్లు వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రమగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది. సముద్ర రవాణా ఖర్చు కేజీకి 50 నుంచి 80 రూపాయలు. విమాన రవాణా ఖర్చు కేజీకి 240 రూపాయల నుంచి 300 రూపాయలు. విమాన రవాణా దాదాపు ఐదు నుంచి ఆరు రెట్లు ఖరీదైనదిగా కావడంతో ఎగుమతిదారుల లాభాలు తగ్గిపోతున్నాయ. ఈ సంక్షోభం కేవలం ఎగుమతిదారులకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని రైతులకు కూడా ఇది పెద్ద దెబ్బ. ఎగుమతులు నిలిచిపోతే, ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్‌కు మళ్లుతాయి. దీని వల్ల దేశీయంగా మామిడి ధరలు భారీగా పడిపోయి రైతులకు కనీస పెట్టబడి పోటీని ఎదుర్కోవడంలో కూడా భారత్ వెనుకబడే అవకాశం ఉంది. ఈ సమస్య కేవలం మామిడికే పరిమితం కాలేదు. అరటి, ద్రాక్ష, ఉల్లిపాయలు, సీ ఫుడ్ వంటి త్వరగా పాడైపోయే వస్తువులపై కూడా ఈ ప్రభావం పడింది. ముంబైలోని జీఎస్పీటీ ఓడరేవులో వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

తిరుపతి, ఏప్రిల్ 9, తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు.

ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసతుల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు. తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు.

వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు. 99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు. టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.

## జనగామ ఆస్పత్రిలో పసిపాప కిడ్నాప్ కలకలం

జనగామ మాతా శిశు ఆసుపత్రిలో బుధవారం రాత్రి ఒక మహిళ పసికందును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించింది. ఆటోలో తరలిస్తున్న శిశువును కుటుంబ సభ్యులు, స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. ఆగ్రహంతో మహిళకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటనతో ఆసుపత్రిలో ఉద్రిక్తత నెలకొంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రి డోర్లు, అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

కాకినాడ, ఏప్రిల్ 9, దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. 2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి. శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం. ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది. శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది. మొత్తానికి, దేవాదాయ శాఖలో పవర్ ఫుల్ వుమెన్ గా చలామణీ అయిన కళింగరి శాంతి ప్రస్థానం ప్రస్తుతం జైలు ఊచల వెనక్కి చేరింది. అధికార గర్వం, అవినీతి వెరసి ఒక అధికారి జీవితాన్ని ఎలా అగాధంలోకి నెట్టేస్తాయో చెప్పడానికి ఈ స్టోరీ ఒక సాక్ష్యం.

## వైసీపీకి ముందున్న సవాళ్లు..వ్యూహాలే కీలకం..

ఒంగోలు, ఏప్రిల్ 9, గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటుస్థానం నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనకు ఆ ప్రాంతంతో ప్రత్యక్ష అనుబంధం లేకపోయినా, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ పోటీకి దిగారు. చిత్తూరు జిల్లా ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన ఆయనను ఒంగోలు ప్రజలు పూర్తిగా అంగీకరించలేకపోయారని విశ్లేషణలు సూచిస్తున్నాయి. స్థానికంగా బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, అది విజయం సాధించేందుకు సరిపోలేదు. ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి విజయం సాధించడం కీలక అంశంగా మారింది. ఆయనకు స్థానిక పరిచయం, ప్రజలతో అనుబంధం ఉండటం కూడా విజయానికి కారణమయ్యాయి. ఎన్నికల్లో కేవలం సామాజిక వర్గాల లెక్కలు సరిపోవు, ప్రజల మనస్తత్వం కూడా అర్థం చేసుకోవాలి అన్న విషయం ఇక్కడ స్పష్టమైంది. ఇలాంటి పరిస్థితులు మరికొన్ని చోట్ల కూడా కనిపించాయి. నెల్లూరు సిటీ నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేట కు అనిల్ కుమార్ ను పంపించడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ తరహా నిర్ణయాలు పార్టీకి ప్రతికూలంగా మారాయని కొందరు భావిస్తున్నారు. నాయకుల వ్యక్తిగత ఇమేజ్‌పై మాత్రమే ఆధారపడటం సరిపోదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# కులరాజకీయాలు....పెరుగుతున్న ఒత్తిడి

నెల్లూరు, ఏప్రిల్ 9, రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం రోజు రోజుకు పెరుగుతోంది. ఒకప్పుడు పార్టీల అంతర్గత వ్యవహారాలుగా ఉన్న కుల ఆధారిత నిర్ణయాలు ఇప్పుడు బహిరంగ చర్చలకు వస్తున్నాయి. ప్రజలు కూడా తమ వర్గాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు, ఏ మేరకు అవకాశాలు కల్పిస్తున్నారు అనే విషయాలను నేరుగా ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇది రాజకీయ వ్యవస్థలో ఒక పెద్ద మార్పుగా భావించవచ్చు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నప్పటికీ, అది ఎక్కువగా పార్టీ లోపలే పరిమితమయ్యేది. సమాజంలో ఉన్న పరిస్థితులను బట్టి కొన్ని వర్గాలకు ఎక్కువ అవకాశాలు, మరికొన్ని వర్గాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతూ వచ్చేది. అయితే, ఈ అసమానతలను చాలా వర్గాలు సహజంగా అంగీకరించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ సమాజం పెద్ద సంఖ్యలో ఉంది. ఈ వర్గం చాలా కాలంగా ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తోంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో రెల్లి సమాజం గణనీయంగా ఉంది. వీరు వ్యవసాయం, సంప్రదాయ వృత్తులతో జీవనం సాగిస్తూ ఉన్నప్పటికీ, రాజకీయంగా తగిన గుర్తింపు లేదని భావిస్తున్నారు. ఇక ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైశ్య వర్గం కూడా ఇప్పుడు రాజకీయంగా చైతన్యం పొందుతోంది. తమకు తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ వారు కూడా తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నారు. తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల్లో కేవలం కాపు వర్గం మాత్రమే కాకుండా, ఇతర సామాజిక వర్గాలు కూడా గణనీయంగా ఉన్నాయనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా ప్రతి జిల్లాలోనూ కొన్ని వర్గాలు తమకు సరైన అవకాశాలు లభించడం లేదని భావిస్తున్నాయి.

ఇప్పటి వరకు నియోజకవర్గాల సంఖ్య పరిమితంగా ఉండటం, పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ అసంతృప్తి అంతగా బయటకు రాలేదు. కానీ పరిస్థితులు మారుతున్నాయి. త్వరలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన కారణంగా సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రతి వర్గం తమకు ఎక్కువ ప్రాధాన్యం కావాలని కోరుతోంది. ముఖ్యంగా మండలాలు, పట్టణ స్థాయిలో నాయకత్వం వహిస్తున్న సామాజిక వర్గాల నేతలు ఈ డిమాండ్లను ముందుకు తెస్తున్నారు. ఇది క్రమంగా రాష్ట్ర స్థాయిలో పెద్ద చర్చగా మారుతోంది. అన్ని రాజకీయ పార్టీలపై ఈ ఒత్తిడి పెరుగుతోంది. ప్రతి వర్గాన్ని సంతృప్తి పరచాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో టికెట్ల కేటాయింపు ప్రక్రియ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. సమతుల్యత పాటించకపోతే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నిజంగా కత్తిమీద సాములా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కర్నూలులోనే మూడు ప్రధానా కార్యాలయాలు

కర్నూలు, ఏప్రిల్ 9, కర్నూలులోని రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ అమరావతికి తరలించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతిలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కోర్టుకు లాయర్ తెలిపారు. మరోవైపు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. 2021లో కార్యాలయాల తరలింపు పిల్‌లు దాఖలయ్యాయి. తాజాగా ప్రభుత్వ క్లారిటీ ఇవ్వడంతో ఈ మూడు ముఖ్యమైన కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగనున్నాయి. కర్నూలులోనే వక్ఫ్ ట్రైబ్యునల్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) కార్యాలయాలు కొనసాగుతాయని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీ హైకోర్టులో రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ తరలింపుపై పిల్ దాఖలైంది.. కర్నూలలో ఉన్న వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని 2021లో సామాజిక కార్యకర్త మహ్మద్ ఫరూఖ్ షిబ్లి హైకోర్టును కోరారు. ట్రైబ్యునల్ మినహా వక్ఫ్‌బోర్డు, తదితర మైనారిటీ సంస్థలన్నీ విజయవాడలో ఉన్నాయని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారుపరిపాలనా సౌలభ్యం కోసం ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోరారు. వక్ఫ్ సంస్థలు, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన ఎక్కువ కేసులు కర్నూలుతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్నాయని ప్రభుత్వం తరఫున లాయర్ వాదించారు. హైకోర్టు కూడా వక్ఫ్ ట్రైబ్యునల్ కర్నూలులో ఉండటంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది.. ఈ మేరకు షిబ్లీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. అంతేకాదు కర్నూలు నుంచి అమరావతికి హెచ్ఆర్సీ, లోకాయుక్తలను తరలించాలని 2021లో హైకోర్టులో పిల్‌లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ), లోకాయుక్త అంశంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టుకు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ)లో ఏపీ, తెలంగాణ మధ్య సిబ్బంది విషయమై విభజన జరగాల్సి ఉందన్నారు. ఇటు లోకాయుక్తను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టుకు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాలను కర్నూలుకు తరలించారు. అయితే ఈ రెండు కార్యాలయాలను అమరావతికి తరలించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి.. వాటిపై హైకోర్టు విచారణ చేస్తోంది. అంతేకాదు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

# బాలాపూర్ లో అక్రమంగా నిల్వచేసిన రైస్ గోదాంలో అధికారుల దాడులు

రంగారెడ్డి బాలాపూర్ పోలీస్ పరిధిలోని సుల్తాన్పూర్ ప్రాంతంలో అక్రమ గోదాంపై పోలీసులు, సివిల్ సప్లైస్ అధికారులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో 523 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 69 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్కు నష్టం కలిగిస్తూ రేషన్ను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్లో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి వనజాత, ఏఎస్ఓ రాజేంద్రనగర్ వి. పుల్లయ్య, సివిల్ ఇన్స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన జనగామ ఎమ్మెల్యే

హైదరాబాద్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసారు. కేంద్ర పథకం పేరుతో ఎమ్మెల్యేను మోసం చేసారు. అపరిచిత ఫోన్ కాల్ ద్వారా తెలంగాణ ఆర్థికశాఖలో అదనపు కార్యదర్శి అనంత అంటూ పరిచయం చేసుకొని పల్లా రాజేశ్వర్ రెడ్డి నుంచి లక్ష రూపాయలు కాజేసాడు. “వికసిత్ భారత్” పథకం పేరుతో నిందితుడు నమ్మబలికాడు. అర్హుల జాబితా పంపిస్తే రూ.10 లక్షల రుణాలు అంటూ మోసం చేసాడు. ఒక్కొక్కరికి 2,500 చొప్పున 1లక్ష ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేసాడు. ఎమ్మెల్యే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపారు. మళ్లీ డబ్బులు అడగడంతో అనుమానం వచ్చింది. దాంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## కవిత, షర్మిలకు బంగారం వంటి అవకాశాలు




హైదరాబాద్, ఏప్రిల్ 9, రాజకీయాల్లో అవకాశాలు రావాలి. కాలం కలిసొస్తే మంత్రి పదవి కూడా చేపట్టకుండా కనీసం ఎమ్మెల్యే కూడా కాకుండా ముఖ్యమంత్రి అయిపోవచ్చు. ఎంపీ కాకుండానే ప్రధాని పదవిలో కూర్చోవచ్చు. ఇవన్నీ ఈ దేశంలో జరిగాయి. ఇక తెలుగు రాజకీయాల్లో చూస్తే ఇప్పటిదాకా పురుషాధిపత్యం సాగుతోంది. మహిళా రాజకీయ నాయకురాళ్ళు ఉన్నారు కానీ వారు ద్వితీయ స్థానాలకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వైఎస్ షర్మిల, కల్వకుంట్ల కవిత ఇద్దరూ తమ రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ఇద్దరూ సొంత కుటుంబాలను వ్యతిరేకిస్తూ సొంత రాజకీయం చేస్తున్నారు. ఇందులో షర్మిల అయితే తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించి కొన్నాళ్ళు అక్కడ రాజకీయం చేశారు. చివరికి ఆ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి 2024 ఎన్నికల ముందు ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె తానుగా గెలవకపోయినా వైసీపీని ఓడించారు. దాంతో పాటు వైసీపీకి రాయలసీమలో పెద్ద దెబ్బ తగిలి ఏకంగా విపక్ష స్థానానికి సైతం సరిపడా సీట్లు దక్కకుండా 11 సీట్లకే పరిమితమై చతికిలపడింది. ఇక ఏపీ కాంగ్రెస్ కి ఆమె ప్రెసిడెంట్ గా తనదైన శైలిలో పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా కాంగ్రెస్ దే కావడం దాని అధినేత జగన్ కావడంతో వైఎస్సార్ వారసురాలిగా షర్మిలను పీసీసీ పీఠం మీద ఉంచితే ఎంతో కొంత కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ దక్కుతుందన్న ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలు జాతీయ స్థాయిలో ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీలో అదనంగా మరో యాభై శాతం సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అంతే కాదు మొత్తం సీట్లలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్ అంటున్నారు. అంటే ఏపీలో 263 సీట్లు పెరిగితే అందులో 88 సీట్ల దాకా విమెన్ రిజర్వేషన్ కిందకు వస్తుంది. ఈ సీట్లలో పోటీ చేయడానికి మహిళా నాయకురాళ్ళు రెడీగా ఉండాల్సిందే. ఇప్పటికే కీలకమైన స్థానాల్లో ఉన్న వారికి ఈ సీట్ల పెరుగుదల రిజర్వేషన్లు అన్నవి అతి పెద్ద బూస్టింగ్ గా అని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కడప జిల్లాలో పది సీట్లు పదిహేను అవుతాయని అంటున్నారు. అయిదు సీట్లు మహిళలకు దక్కుతాయి. కడప అంటే వైఎస్సార్ ఫ్యామిలీకి కంచుకోట. 2024 లో కడప ఎంపీ సీటుకు షర్మిల పోటీ చేశారు. లక్షన్నర ఓట్లు తెచ్చుకున్నారు. ఇపుడు పెద్ద నియోజకవర్గాలు చిన్నవిగా మారితే మహిళా రిజర్వేషన్లు అయితే షర్మిలకు కుటుంబ నేపథ్యం, రాజకీయంగా పరిస్థితులు అనుకూలించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఆమె మీద బలమైన అభ్యర్థులను ప్రత్యర్థులు వెతకాల్సి ఉంటుంది. లేకపోతే స్టేట్ వైడ్ లీడర్ గా ఉన్న షర్మిల జాగ్రత్తగా చేసుకుంటే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టడం కష్టం కాబోదు అని అంటున్నారు. కవిత తెలంగాణాలో కొత్త పార్టీని స్థాపించబోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కొత్తగా సీట్లు పెరగడం చిన్న అసెంబ్లీ నియోజకవర్గాలుగా మారడం కలిసి వచ్చే అంశమే అంటున్నారు. అక్కడ కూడా 59 దాకా సీట్లు మహిళా రిజర్వేషన్ల రూపంలో దక్కనున్నాయి. కవిత జనంలో ఉంటున్నారు తండ్రి కేసీఆర్ మాదిరిగానే ఫైర్ బ్రాండ్ గా ఉంటున్నారు. దాంతో ఆమె తనతో పాటు కొందరు మహిళా నేతలను కనుక జాగ్రత్తగ ఎంపిక చేసుకుంటే రిజర్వ్ సీట్లలో గెలుచుకోగలరని అంటున్నారు. అలాగే ఇమేజ్ ఉన్న నాయకులు ఆమె పార్టీలో చేరితే చతుర్ముఖ పోరులో చిన్న నియోజకవర్గాల్లో ఓట్లు అటు నుంచి ఇటు అయితే గెలిచే వీలు ఉంటుందని లెక్క వేస్తున్నారు. మొత్తానికి కవిత పార్టీకి ఇది శుభారంభం అని అంటున్నారు. ఏది ఏమైనా మహిళా రాజకీయ నాయకురాళ్ళుగా పట్టుదలగా పోరాడుతున్న కవిత షర్మిల రాజకీయ జాతకాన్ని మార్చే విధంగా పునర్ విభజన కానీ మహిళా రిజర్వేషన్ కానీ ఉండబోతున్నాయా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు.

## హిట్ లిస్ట్ లో మరో ఎమ్మెల్యే

విజయవాడ, ఏప్రిల్ 9, ముఖ్యమంత్రి చంద్రబాబు హిట్ లిస్టులో మరో ఎమ్మెల్యే చేరారు. తొలిసారిగా ఎమ్మెల్యే అయిన ఆ నేత తన దుందుడుకు ప్రవర్తనతో పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని సీఎం చంద్రబాబుకు ఫిర్యాదులు వస్తున్నాయని అంటున్నారు. ఇటీవల ఓ మీడియా ప్రతినిధితో దురుసుగా మాట్లాడటమే కాకుండా ఫోన్ లో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆ ఎమ్మెల్యేపై పార్టీ అధిష్టానం సీరియస్ గా ఉన్నట్లు చెబుతున్నారు. ఇక తాజాగా ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన జిల్లా ఎమ్మెల్యేల సమావేశంలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన సీఎం చంద్రబాబు పద్దతి మార్చుకోకపోతే పక్కకు తప్పిస్తానంటూ స్ట్రైట్ వార్నింగ్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడ గోవిందరావు పద్దతి సరిగా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఉండవిల్లిలోని సీఎం నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం జరిగింది. ఒక్కో నియోజకవర్గంలో పరిస్థితులపై చర్చించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాతపట్నం విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని అంటున్నారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యే కేవలం 21 నెలల్లోనే అనేక వివాదాల్లో చిక్కుకుంటున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారని చెబుతున్నారు. ? “ నీ వ్యవహారశైలిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. పాతపట్నం మొదటి నుంచీ టీడీపీకి బలమైన నియోజకవర్గం. అక్కడ వైసీపీ ఇన్‌ఛార్జి కూడా బలంగా లేరు. నీ ప్రవర్తన వల్ల పార్టీకి నష్టం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ప్రవర్తన, మాటతీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవు” అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారని అంటున్నారు. సహచర ఎమ్మెల్యేల సమక్షంలోనే సీఎం ఇలా చీవాట్లు పెట్టడంతో ఎమ్మెల్యే గోవిందరావు తెల్లముఖం వేశారని అంటున్నారు. .రామ్మోహన్ మెరుపులు పార్టీకి ఇబ్బంది కలిగేలా ప్రవర్తించిన వారిని సహించబోనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని చెబుతున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారు చాలా జాగ్రత్తగా ఉండాలని హితబోధ చేశారని అంటున్నారు. గత ఎన్నికల్లో పాతపట్నం ఎమ్మెల్యేగా గోవిందరావు గెలిచారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ తొలి నుంచి బలంగా ఉండేది. సీనియర్ నేత కలమట కుటుంబమే ఇక్కడి నుంచి ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించింది. అటువంటి నేతను కాదని గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గోవిందరావుకు తొలిసారి అవకాశం ఇచ్చారు. రాజకీయాలకు కొత్త అయినా, ఎన్నికలకు ముందు కేడర్ తో సత్సంబంధాలు ఏర్పరుచుకుని గోవిందరావు పార్టీలో మంచి పేరు తెచ్చుకున్నారు. కానీ, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన పద్ధతిలో చాలా మార్పు కనిపిస్తోందని కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. పార్టీలో సీనియర్లను పక్కన పెట్టేలా నడుచుకోవడమే కాకుండా, నియోజకవర్గంలో తన ప్రమేయం లేకుండా ఏ పనీ జరగడానికి వీల్లేదన్నట్లు ఎమ్మెల్యే నడుచుకోవడం విమర్శలకు తావిస్తోందని అంటున్నారు. చివరికి పత్రికల్లో ప్రభుత్వ పథకాల కోసం రాయాలన్నా ఎమ్మెల్యే అనుమతి ఉండాలన్నట్లు వ్యవహారం వెళ్లిందని, దీంతో ఆయన విషయమై ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీగా ఫిర్యాదులు వెళ్లినట్లు చెబుతున్నారు.

## అమ్మాయిలే లక్ష్యంగా జీహాదీ ట్రైనింగ్

విజయవాడ, ఏప్రిల్ 9, విజయవాడ టెర్రర్ లింక్ కేసులో హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించే బాధ్యతను సైదా బేగం తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. ప్రత్యేకంగా యువతులను లక్ష్యంగా చేసుకుని వారిని రిక్రూట్ చేయాలని ఉగ్రవాద సంస్థలు ఆమెకు టాస్క్ ఇచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు దాదాపు 42 మంది అమ్మాయిలను ఆమె తన నెట్‌వర్క్‌లోకి తీసుకువచ్చినట్లు సమాచారం. రిక్రూట్ చేసిన మహిళలకు స్నిప్పర్ రైఫిల్ వినియోగం, షూటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వాలనే సూచనలు కూడా సైదాకు అందినట్లు విచారణలో వెల్లడైంది. “ఖ్వాతీన్” పేరుతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తూ మహిళలను ఒక్కచోట చేర్చి, వారిలో తీవ్రవాద భావజాలాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. యువతను మతపరంగా ఆకర్షించి నెట్‌వర్క్‌ను విస్తరించాలని జిహాదీ గ్రూపులు ఆమెకు నిరంతరం ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒసామా బిన్ లాడెన్, జకీర్ నాయక్ వీడియోలను షేర్ చేస్తూ యువతలో తీవ్రవాద భావజాలాన్ని నింపేందుకు సైదా ప్రయత్నించినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 40 అకౌంట్లు తెరిచి జిహాదీ ప్రచారం కొనసాగించినట్టు గుర్తించారు. మదర్సాల్లో మతపరమైన శిక్షణ పూర్తయ్యాక ఆయుధాల వినియోగంపై ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించినట్టు విచారణలో తేలింది. సైదా ఉపయోగించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నుంచి పెద్ద ఎత్తున ఫైల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బ్లాక్ పౌడర్ తయారీ, పేలుడు పదార్థాల నిర్మాణం వంటి ప్రమాదకర అంశాలపై వీడియోలు, డాక్యుమెంట్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ కేసులో మరిన్ని లింకులు బయటపడే అవకాశముందని అధికారులు అనుమానిస్తున్నారు.

## కారులోనే యవ్వారం

ఛండీఘఢ్, ఏప్రిల్ 9, పంజాబ్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా పాకిస్థాన్ మద్దతుతో నడుస్తున్న ఒక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠాను పంజాబ్ పోలీసులు ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 16.8 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని, ఒక మహిళతో సహా నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. అరెస్ట్ అయిన వారిని బల్విందర్ సింగ్(కపుర్తలా), సుమన్ ప్రీత్ కౌర్, హర్పాల్ సింగ్, జస్కరణ్‌బీర్ సింగ్(అమృత్‌సర్)గా గుర్తించారు. వీరు మారుతీ బలెనో కారులో డ్రగ్స్ తరలిస్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో మాటు వేసి పట్టుకున్నారు. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక పాకిస్థాన్, దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న హ్యాండ్లర్ల హస్తం ఉందని ప్రాథమిక విచారణలో తేలినట్టు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ హెరాయిన్ నిల్వలను అమృత్‌సర్ సరిహద్దు ప్రాంతం నుంచి సేకరించి, చండీగఢ్‌లో డెలివరీ చేసేందుకు నిందితులు ప్లాన్ చేశారు. కాగా, నిందితుల వద్ద నుంచి డ్రగ్స్‌తో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ ముఠాకు ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? గతంలో ఇలాగే ఎన్నిసార్లు డ్రగ్స్ సరఫరా చేశారు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## దళపతికి దారేది...



చెన్నై, ఏప్రిల్ 9, తమిళ సినీ స్టార్ విజయ్ తన రాజకీయ ప్రయాణంలో సామాన్యులకే పీఠం అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ఎన్నికల కోసం ఆయన ఎక్కువగా అభిమానులకు, సామాన్య కార్యకర్తలకు టిక్కెట్లు కేటాయించారు. అయితే, ఆచరణలోకి వచ్చేసరికి ఈ నిర్ణయం పార్టీకి పెను సవాలుగా మారింది. ఎన్నికల నిర్వహణలో తలపండిన డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి దిగ్గజ పార్టీల ఒత్తిడికి తలొగ్గుతున్నారు. బరి నుంచి వైదొలుగుతున్నారు. విజయ్ పార్టీకి చెందిన అభ్యర్థుల్ని బరి నుంచి తప్పించేందుకు డీఎంకే, అన్నాడీఎంకే కూటములు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. నామినేషన్ల సమయం ముగియడంతో తమ ప్లాన్ అమలు చేస్తున్నారు. తాజాగా ఎడప్పాడి నుంచి టీవీకే అభ్యర్థి వైదొలిగారు. అలాగే సుమారు 20కి పైగా స్థానాల్లో అభ్యర్థులు బరి నుండి తప్పించే ప్రణాళికల్ని అమలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను తట్టుకోలేకనో లేదా ఎన్నికల ఖర్చును భరించలేకనో వారు వెనకడుగు వేస్తుండటం విజయ్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవేళ నామినేషన్ల పర్వం ముగిశాక అభ్యర్థులు సైలెంట్ అయిపోయినా లేదా పోటీ నుండి తప్పుకున్నా, అది కొత్తగా పుట్టిన టీవీకే పార్టీ పరువును బజారున పడేస్తుందని ఆ పార్టీ అంతర్గత వర్గాలు భయపడుతున్నాయి. విజయ్ పార్టీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య బలమైన అభ్యర్థుల కొరత . క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగల పేరున్న నేతలు లేకపోవడం పార్టీకి మైనస్‌గా మారుతోంది. తమిళనాడులో ద్రవిడ ముద్ర బలంగా ఉన్న నేపథ్యంలో, కేవలం విజయ్ ఇమేజ్ మాత్రమే అభ్యర్థులను గట్టెక్కిస్తుందా అన్నది అనుమానమే. బలమైన నేతలు లేని పక్షంలో ఓట్ల చీలిక జరిగి, అది పరోక్షంగా అధికార పార్టీకే లాభం చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడులో విజయ్ రాజకీయ పరిపక్వతపై ఇప్పటికే సెటైర్లు వేస్తున్నాయి. పార్టీ పెట్టడం సులభం.. కానీ బరిలో నిలబెట్టడం కష్టం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. అభ్యర్థులు ఉపసంహరించుకుంటే ఆ ప్రభావం విజయ్ భవిష్యత్తు రాజకీయాలపై తీవ్రంగా పడుతుందిఈ క్రమంలోనే విజయ్ తన కోర్ టీమ్‌తో అత్యవసర సమావేశాలు నిర్వహిస్తున్నారని, అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక, నైతిక మద్దతును ఎలా అందించాలనే దానిపై కసరత్తు చేస్తున్నారని సమాచారం. వెండితెరపై వందల కోట్లు కొల్లగొట్టిన దళపతికి, రాజకీయ క్షేత్రంలో అభ్యర్థుల ఎంపికే మొదటి పెద్ద అడ్డంకిగా మారింది. ఈ గండాన్ని విజయ్ ఎలా అధిగమిస్తారనే దానిపైనే తమిళగ వెట్రి కళగం భవిష్యత్తు ఆధారపడి ఉంది. సీనియర్ నేతలను చేర్చుకోకుండా కేవలం అభిమానులపైనే భారం వేయడం సాహసమా లేక అనాలోచిత నిర్ణయమా అనేది కాలమే నిర్ణయించాలి.

### జనసేన నేత మోసం చేసాడు
### బాధిత మహిళ వీడియో

విజయవాడమరో జనసేన నేత రాసలీలలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎపిసోడ్ ఘటన మరవకముందే, తనను మోసం చేశాడంటూ మరో జనసేన నాయకుడి భాగోతం ఒక మహిళ బయట పెట్టింది. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జడ్పీటీసీ జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా, శారీరకంగా వాడుకుని, చిత్రహింసలు పెడుతున్నాడని వీడియో విడుదల చేసింది. తాను పవన్ కళ్యాణ్ అభిమానినని, పార్టీ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు జయప్రకాష్ నాయుడు పరిచయమయ్యాడని, భర్త లేని నన్ను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటానని నమ్మించాడని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని రోజుల తర్వాత మద్యం మత్తులో, గంజాయి మత్తులో తనను చితకబాదేవాడని, తనను కూడా గంజాయి సేవించమని ఒత్తిడి చేసేవాడని బాధిత మహిళ ఆరోపించింది. తనతో ఉండనని చెప్తే, నీ ఫోటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ కన్నీరు పెట్టుకుంటూ వీడియో విడుదల చేసింది.

### సంతోష్ నగర్ లో గ్యాంగ్ వార్..యువకుడిపై దాడి

హైదరాబాద్ పాతబస్తీలో మాయా గ్యాంగ్ అరాచకాలు పెచ్చరిల్లిపోతున్నాయి. తాజాగా సంతోష్నగర్ పరిధిలోని జవహర్ కాలనీలో బాసిత్ అనే యువకుడిపై సోహైల్, సొద్ అనే సభ్యులు విచక్షణారహితంగా దాడి చేసారు. ఈ దారుణ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అకారణంగా దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గతంలోనూ ఈ గ్యాంగ్పై అనేక కేసులున్నట్లు తెలుస్తోంది. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## మాటలతో హామీల అమలు...
## వాక్చాతుర్యంతో బురిడి

హైదరాబాద్, ఏప్రిల్ 9, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు గడుస్తున్న తరుణంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ప్రధాన హామీల అమలు తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పెళ్లైన మూడు నెలలకే బిడ్డ పుడతారా అంటూ హామీల అమలుకు సమయం కావాలని కోరుతున్నప్పటికీ, సామాన్య ప్రజానీకం మాత్రం ఫలితాల కోసం వేచి చూస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం , ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలులోకి తెచ్చింది. ఇవి క్షేత్రస్థాయిలో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాయి. అలాగే, గ్యాస్ సిలిండర్లను రూ. 500 కే అందించే పథకం కూడా లబ్ధిదారులకు అందుతోంది. అయితే, ఇవి కేవలం ఆరు గ్యారంటీలలోని ఒక భాగం మాత్రమే. అత్యంత కీలకమైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 నగదు బదిలీ హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనిపై కోట్లాది మంది మహిళలు ఆశలు పెట్టుకున్నారు. అలాగే, రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా పంపిణీలో కూడా జాప్యం జరుగుతోంది. పాత బకాయిలు తీర్చడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో, కొత్తగా పెంచిన మొత్తాన్ని ఎప్పుడు ఇస్తారనే దానిపై స్పష్టత కరువైంది. యువతకు ఇస్తామన్న యువ వికాసం కార్డులు, నిరుద్యోగ భృతి వంటివి కూడా ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. అతి పెద్ద సవాల్ పెన్షన్ల పెంపు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు సహా అనేక వర్గాలకు ఇస్తున్న పెన్షన్లను భారీగా పెంచుతామని రేవంత్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు.కానీ ఇప్పటి వరుక అమలు కాలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచుగా గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 7 లక్షల కోట్ల అప్పుల గురించి ప్రస్తావిస్తూ, ఖజానా ఖాళీగా ఉండటం వల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని వివరిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తనను తాను సమర్థించుకోవడానికి ఉపయోగపడవచ్చు కానీ, ప్రజల్లో ఉన్న అసహనాన్ని తగ్గించలేకపోతున్నాయి. సంక్షేమ పథకాలకు నిధులు సర్దుబాటు చేయడం కోసం ప్రభుత్వం కొత్త అప్పులు చేయాల్సి రావడం లేదా ఇతర అభివృద్ధి పనులకు నిధులు కోత విధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఆరు నెలల నుండి ఏడాది లోపు కనీస మార్పును ఆశిస్తారు. రెండున్నర ఏళ్లు దాటినా కీలక హామీలు అందకపోవడం వల్ల ప్రజల్లో నెమ్మదిగా వ్యతిరేకత మొదలయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి , గ్రామీణ ఓటర్లు కేవలం వివరణల కంటే, తమ ఖాతాల్లోకి వచ్చే నగదు లేదా తమ బతుకుల్లో వచ్చే మార్పునే గమనిస్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వాక్చాతుర్యంతో ఎంతకాలం నెట్టుకొస్తుందో కానీ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి హామీల అమలులో పురోగతి చూపకపోతే అది పార్టీకి నష్టం చేకూర్చవచ్చు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టో అనేది ఒక పవిత్రమైన పత్రం. దానిని కేవలం ఓట్లు దండుకోవడానికి ఉపయోగించే కాగితం గా కాకుండా, ప్రజలతో చేసుకున్న ఒప్పందంగా భావించాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివరణలను పక్కన పెట్టి, ఆర్థిక వనరులను సమకూర్చుకుని మిగిలిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, మరో అవకాశం ఇస్తాం అని చెప్పే లోపే ప్రజల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యే ప్రమాదం ఉంది.

### మూడు రాష్ట్రాల్లో పోలింగ్ ప్రారంభం

న్యూఢిల్లీ కేరళం, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే విడతలో పోలింగ్ గురువారం ప్రారంభం అయింది. అస్సాంలో హ్యాట్రిక్ పై బీజేపీ, కేరళంలో హ్యాట్రిక్ పై లెఫ్ట్ కూటమి గురిపెట్టాయి. హోరాహోరీగా బిజెపి, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల పోరాటం జరగనున్నది. మూడు రాష్ట్రాల్లో 6.1 కోట్లకు పైగా ఓటర్లు వున్నారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. 2.5 కోట్ల మంది ఓటర్లు వున్నారు. కేరళంలో 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుండగా, 2.71 కోట్ల మంది ఓటర్లు నమోదయ్యారు. ఇక కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ 9.44 లక్షల మంది ఓటర్లు వున్నారు. ఎన్నికల ఫలితాలు మే 4 న వెలువడనున్నాయి.

# వేగంగా ఫ్యూచర్ సిటీ అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 9, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై స్టే ఇచ్చేందుకు చెన్నై ఎన్జీటీ నిరాకరించింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీని ప్రభుత్వం చేపడుతోందని పిటిషనర్ వాదించగా.. అది ఇంకా తొలి దశలోనే ఉందని.. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వాదించారు. అయితే నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడా పనులు చేయబోమని ఎన్జీటీకి ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణను ఎన్జీటీ వాయిదా వేసింది.తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం.. ఊరట కల్పించింది. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై దాఖలైన పిటిషన్‌పై స్టే ఇచ్చేందుకు ఎన్జీటీ చెన్నై బెంచ్ నిరాకరించింది. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్‌కు రిలీఫ్ కలిగింది. ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నోటిఫికేషన్-2006లో వెల్లడించిన ప్రకారం.. పర్యావరణ అనుమతులు లేకుండానే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని.. హైదరాబాద్ కొంపల్లికి చెందిన డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డి.. ఎన్జీటీలో పిటిషన్ వేయగా.. తాజాగా విచారణ జరిపింది.దాదాపు 30 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును నిర్మించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు నిర్మాణంపై స్టే విధించాలని పిటిషనర్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి కోరారు. అదే సమయంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడం చట్ట విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఇక ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించి.. ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు గానీ, అభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రారంభించలేదని ప్రభుత్వం తరఫు లాయర్ వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో చట్టవిరుద్ధంగా.. నిబంధనలను అతిక్రమించి.. ఎలాంటి పనులు చేపట్టబోమని హామీ ఇచ్చారు. ఇక త్వరలోనే పర్యావరణంతోపాటు అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇరు వైపులా వాదనలు విన్న చెన్నై ఎన్జీటీ బెంచ్.. ఈ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు ఇంకా ప్రారంభం కానందున అనుమతులు తీసుకునేందుకు ఇంకా సమయం ఉందని పేర్కొంటూ.. దీనిపై స్టే ఇచ్చేందుకు నో చెప్పింది. ఇక పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది.

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మీదుగా ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి ఆమనగల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగు రోడ్డు వరకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే ఈ కొత్త రహదారి నిర్మాణం చుట్టూ న్యాయవివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్డు నిర్మాణ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారంటూ30 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. యాచారం మండలం కుర్మిద్ద, కడ్తాల్ మండలం కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి గ్రామాల్లో మొత్తం 554.34 ఎకరాల సేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. అయితే.. భూసేకరణ, పునరావాసం చట్టం-2013లో పేర్కొన్న తప్పనిసరి నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని వారు ఆరోపించారు. ముఖ్యంగా నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకోవాల్సి ఉండగా.. ఆ ప్రక్రియను మొక్కుబడిగా పూర్తి చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు.తమ అభ్యంతరాలను అకారణంగా తిరస్కరించారని ఇది చట్టవిరుద్ధమని, ఏకపక్షమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 61.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ భూముల నుంచి తమను బలవంతంగా ఖాళీ చేయించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వాస్తవ పరిస్థితులపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మొత్తం 554.34 ఎకరాల్లో సుమారు 200 ఎకరాల భూమి వివాదంలో ఉందని.. మిగిలిన భూమికి సంబంధించి 26 ఎకరాలకు ఇప్పటికే పరిహారం అవార్డులు జారీ చేశామని వెల్లడించారు. ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా భూసేకరణపై స్టే ఇవ్వవద్దని ఆయన కోర్టును కోరారు. అలాగే.. రైతులకు పరిహారం చెల్లించే వరకు వారిని భూముల నుంచి ఖాళీ చేయించబోమని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. ఈ హామీని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. తదుపరి విచారణను సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

# మురుగునీరు పారేదెలా...

వరంగల్, ఏప్రిల్ 9, కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా కేసముద్రం పట్టణ డ్రైనేజీ పరిస్థితి మారింది. కేసముద్రం మండల కేంద్రాన్ని కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజ్, అమీనాపురం, ధనసరి, సబ్ స్టేషన్ తండా గ్రామాలను విలీనం చేసి కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. కేసముద్రం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా చొరవచూపి ప్రభుత్వం నుండి వందల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించారు.ఇందులో భాగంగా రోడ్ల విస్తరణతో పాటు డ్రైనేజీ మెరుగుపరచడానికి చర్యలు చేపట్టారు. రోడ్ల విస్తరణ పనులను ప్రారంభించగానే కొందరు తమకు నష్టం జరుగుతోందని, ఇండ్లు కోల్పోతున్నామని అభ్యంతరం వ్యక్తం చేయడంతో రోడ్ల పనులు పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్ల విస్తరణ కోసం పాత డ్రైనేజీ కాలువలను పూర్తిగా తవ్వడంతో ఇప్పుడు మురుగు నీరు అంతా ఎక్కడికి అక్కడే తిష్ట వేస్తోంది.గతంలో ఉన్న డ్రైనేజీలను పూర్తిగా తొలగించడం వల్ల పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట, అలాగే వీధుల్లో ఎక్కడికక్కడే నిలిచిపోయి కంపు కొడుతున్నాయి. ఇండ్ల ముందు, షాపుల వద్ద కొన్నిచోట్ల సైడ్ కాలువల్లో మురుగునీరు తిష్ట వేసి, అనారోగ్యానికి అడ్డాలుగా మారుతున్నాయి. దీంతో కొందరు గత్యంతరం లేక ఇంటి ఎదుట మురుగునీరు నిలువ కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక ఫ్లై మహాత్మ జ్యోతిబాపూలే సెంటర్ నుండి రైల్వే ఫ్లైఓవర్ మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు రోడ్డు విస్తరించినప్పటికీ డ్రైనేజీ పనులు చేపట్టలేదు. దీనితో ఆ రహదారి వెంట ఇరువైపులా ఉన్న షాపులు, ఇండ్లలోని మురుగునీరు అక్కడే తిష్ట వేస్తోంది. ఇక వర్షాకాలం వస్తే వరద నీరు కూడా రోడ్డుపైనే ప్రవహించాల్సిన పరిస్థితి నెలకొంది. కేసముద్రం పట్టణంలో మండు వేసవికాలంలోనే డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి ఇలా ఉంటే, ఇక వర్షాకాలంలో ప్రజలు ఎన్ని తిప్పలు పడాలో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఎక్కడి నీరు అక్కడే నిలిచి ఉండడం వల్ల దోమల బెడద తీవ్రంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు స్పందించి అభ్యంతరం లేని చోట పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని, మున్సిపాలిటీ అధికారులు మురుగునీరు నిలవకుండా పారిశుద్ధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.పాత కాలువలను కూలగొట్టారు. కొత్తవి నిర్మించకుండా వదిలేశారు. మురుగు నీరు అంతా ఇంటి ముందే నిలుస్తోంది. దుర్గంధం వల్ల ఇంట్లో ఉండడం కష్టం కాగా, కనీసం బయటకు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. రోడ్లు పూర్తి చేయకపోవడంతో అటు దుబ్బ, ఇటు సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో దుర్గంధంతో ఇంట్లో నుండి కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధి పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు.కేసముద్రం పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన ప్రధాన, అంతర్గత డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మురుగునీరు ఎక్కడ కూడా నిలవకుండా అవసరమైన లెవెల్స్ తీసుకోవడానికి ఇంజనీరింగ్ అధికారుల ద్వారా చర్యలు చేపట్టాం. వర్షాకాలానికి ముందే డ్రైనేజీ పనులను పూర్తి చేయిస్తాం.

# జీవన్ రెడ్డికి సెక్రటరీ జనరల్ పదవి.. సీనియర్ల గుసగుసలు

కరీంనగర్, ఏప్రిల్ 9, కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంటూ, కష్టకాలంలోనూ పార్టీ జెండా మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ లో చేర్చుకోవడం.. మున్సిపల్ ఎన్నికల ముందే ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డిని తీవ్ర అసహనానికి గురిచేసింది. గెలిచిన నేతలను చేర్చుకుంటూ ఓడిన మమ్మల్ని అవమానిస్తారా అంటూ ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన గులాబీ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జోరుగా సాగుతోంది.బీఆర్ఎస్ అధిష్టానం జీవన్ రెడ్డికి కేకే వదిలిపెట్టిన సెక్రటరీ జనరల్ వంటి కీలక పదవిని ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కేసీఆర్ తర్వాత అంతటి ప్రాధాన్యత ఉన్న పదవిని, కొత్తగా వచ్చిన వ్యక్తికి కట్టబెట్టడంపై మొదటి నుండి కారు పార్టీని నమ్ముకున్న సీనియర్లలో అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది. ఎంతో కాలంగా పార్టీని అంటిపెట్టుకున్న ఇతర ఉమ్మడి కరీంనగర్ నేతలను పక్కనపెట్టి, నిన్నటిదాకా తమను తిట్టిన నేతకు రెడ్ కార్పెట్ వేయడం ఏమిటని కొందరు నేతలు అంతర్గత సమావేశాల్లో చర్చించుకుంటున్నారు.జీవన్ రెడ్డి రాకతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాయకత్వ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయి. ఇప్పటికే జిల్లాలో గంగుల కమలాకర్ వంటి బలమైన నేతలు ఉండగా, ఇప్పుడు జీవన్ రెడ్డి వంటి దిగ్గజం చేరడం ఆధిపత్య పోరు కు దారితీయవచ్చు. ముఖ్యంగా జగిత్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పుడు ఎవరి కింద పనిచేయాలన్న గందరగోళంలో ఉన్నాయి. నిన్నటిదాకా కొట్టుకున్న వర్గాలు ఇప్పుడు ఒకే జెండా కింద ఎలా కలిసి సాగుతాయన్నది పెద్ద ప్రశ్న. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్ రెడ్డికి ఉన్న వ్యక్తిగత ఇమేజ్ బీఆర్ఎస్‌కు బలంగా మారవచ్చు కానీ, అది పాత క్యాడర్‌లో చీలిక తెచ్చే ప్రమాదం ఉంది. సంజయ్ కుమార్ వైఖరికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తుండటంతో, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయే అవకాశం ఉంది. ఎన్నో అవకాశాలు వచ్చినా గెలవని జీవన్ రెడ్డిని చేర్చుకోవడం వల్ల పార్టీకి లాభమా లేక నష్టమా అనే చర్చ బీఆర్ఎస్‌లో జరుగుతున్నా, ఆయన అనుభవం పార్టీకి అవసరమని అధిష్ఠానం గట్టిగా నమ్ముతోంది. అయితే, ఈ నిర్ణయం కరీంనగర్ గులాబీ తోటలో ముళ్లు జల్లినట్టే అవుతుందన్నది విశ్లేషకుల అంచనా. జీవన్ రెడ్డికి అంత ప్రజాబలం లేదని.. అయనకు బదులుగా యువనేతల్ని ప్రోత్సహిస్తే మంచిదని.. గతంలో కేకేను ప్రోత్సహిస్తే ఏం జరిగిందో తెలుసుకదా అని క్యాడర్ ప్రశ్నిస్తున్నారు.

మరో వైపు

ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జీవన్ రెడ్డి టచ్‌లో ఉన్నారు. ఒక దఫా ప్రాథమిక చర్చలు కూడా ముగిసినట్లు జీవన్ రెడ్డి అనుచరులు చెబుతున్నారు. జీవన్ రెడ్డికి పార్టీలో కీలక పదవి.. ఆయన కోడలికి జగిత్యాల టికెట్ లాంటి అంశాలను చర్చించినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి సీనియార్టీకి తగిన పదవితో పాటు వచ్చే ఎన్నికల్లో ఆయన కోరిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ అంగీకరించిందన్న టాక్ వినిపిస్తోంది.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో విభేదాల కారణంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర అసహనంతో ఉన్నారు జీవన్ రెడ్డి. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పాక తన అనుచరులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. కొంత మంది అనుచరులు బీజేపీ వైపు వెళ్దామని సలహా ఇచ్చినప్పటికీ తనకున్న ముస్లిం అనుచరులు, మైనార్టీ ఓటు బ్యాంక్ దృష్ట్యా జీవన్ రెడ్డి బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కేటీఆర్, హరీష్ రావులతో చర్చల అనంతరం జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే తేదీ ఖరారు కానుంది

# 13 ప్రాంతాల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 9, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు టీజీఆర్టీసీ తన రవాణా వ్యవస్థను ఆధునీకరిస్తోంది. పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పాత డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్న ఆర్టీసీ.. ఇప్పుడు వాటికి అవసరమైన మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి సారించింది. నగరంలోని అన్ని ప్రధాన డిపోల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చేలా ఆర్టీసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కంటోన్మెంట్, మియాపూర్, రాణిగంజ్, హయత్‌నగర్, హెచ్‌సీయూ వంటి కీలక డిపోల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉండగా.. వచ్చే నెలలో కూకట్‌పల్లి స్టేషన్‌ను కూడా ప్రారంభించనున్నారు.నగరవ్యాప్తంగా మరో 13 కొత్త ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఫరూక్‌నగర్, బర్కత్‌పుర, మెహిదీపట్నం, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, ఉప్పల్, చెంగిచెర్ల, జీడిమెట్ల, కాచిగూడ, మిధాని, బండ్లగూడ, ముషీరాబాద్, జవహర్‌నగర్ డిపోలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఏడాది కాలంలోనే ఈ స్టేషన్లన్నింటినీ ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువు విధించుకున్నారు. ఈ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి వస్తే నగరంలోని వివిధ రూట్లలో ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయిరాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం.. రానున్న రెండేళ్లలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కేవలం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే నడపాలని డిసైడ్ అయ్యారు. దీనివల్ల నగరంలో కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రేటర్ జోన్ పరిధిలో 490 ఎలక్ట్రిక్ బస్సులు వివిధ డిపోల నుంచి విజయవంతంగా రాకపోకలు సాగిస్తున్నాయి. విడతలవారీగా కొత్త బస్సులు రోడ్డుపైకి రానున్నాయని.. అందుకు అనుగుణంగా ఛార్జింగ్ పాయింట్ల సంఖ్యను కూడా పెంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.కేవలం బస్సుల సంఖ్యను పెంచడమే కాకుండా.. ఛార్జింగ్ స్టేషన్ల వద్ద అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యాల వల్ల బస్సుల వెయిటింగ్ టైమ్ తగ్గి, మెరుగైన సేవలందించడానికి వీలవుతుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ మెగా ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ ప్రజా రవాణా వ్యవస్థ కలిగిన నగరాల్లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు.

నగరవాసులకు కాలుష్య రహిత, సుఖవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని చెబుతున్నారు.

# భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్ రెడీ

నిజామాబాద్ ఏప్రిల్ 9, భూముల సమస్యలు రాకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ భూభారతి పోర్టల్ ద్వారా పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసేందుకు రెడీ అయింది. భూముల రిజిస్ట్రేషన్ కోసం.. ముందుగా సర్వే చేసి.. అక్కడి భూమికి, రికార్డుల్లో సమాచారం సరిపోలితేనే ఇక నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఇక ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయిన భూమి సర్వే నంబర్లు గానీ, విస్తీర్ణం గానీ మార్చే అవకాశం లేకుండా పక్కా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించినా భూభారతితో వారిని గుర్తించనున్నారు.

భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో ఎన్నో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి అసలు పొంతన ఉండదు. ప్రభుత్వ భూములు, ఇతరుల భూమిని ఆక్రమించి ఉన్న భూముల కంటే ఎక్కువ భూములను రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు ఉంటారు. ఇక క్షేత్ర స్థాయిలో ఎక్కువ భూమి ఉన్నా.. రికార్డులు సరిగా లేకపోవడం వల్ల పట్టా పాసు పుస్తకాల్లో తక్కువ భూమి రిజిస్ట్రేషన్ కావడం వంటి ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీంతో రైతులు పంట పండించడం కంటే ఎక్కువగా భూరికార్డుల సవరణ కోసం అధికారుల చుట్టూ తిరగడమే ఎక్కువ అవుతోంది. ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో ఈ సమస్యలు మరిన్ని పెరిగాయని ఆరోపించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని సరిచేయడానికి భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు చెబుతోంది. పైలట్ ప్రాజెక్టు కింద ఈ భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను అమలు చేసేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని 5 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి.. అమలు చేసేందుకు రెడీ అయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ఈ భూభారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా గురువారం ప్రారంభమైంది.ఈ సమగ్ర భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. నిజంగా ఉన్న భూమికి.. రికార్డుల్లో ఉన్న సమాచారం సరిగ్గా సరిపోతేనే భూ భారతి పోర్టల్లో భూమిని రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన తర్వాత రైతుకు పట్టాదార్ పాసు పుస్తకంతోపాటు భూధార్ నంబర్‌ను కూడా కేటాయిస్తారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లను గానీ.. విస్తీర్ణాన్ని గానీ మార్చడానికి అవకాశమే ఉండదు. రాష్ట్రంలో భూముల వ్యవస్థను పకడ్బందీగా సరిచేసేందుకు రెవెన్యూ శాఖ ఈ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది.ఇక ఈ భూభారతిలో భాగంగా సర్వే, రిజిస్ట్రేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లను కలిపి ఒకే పోర్టల్ కిందికి తీసుకువచ్చారు. సర్వే వివరాలు.. స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న వివరాలు (22 ఎ, ఇతరత్రా), రెవెన్యూ శాఖ రికార్డుల్లో ఉన్న వివరాలు అన్నీ ఈ పోర్టల్లో అందుబాటులో ఉంచారు. మరోవైపు.. 2020 నవంబరు 2వ తేదీ నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే.

అయితే అందులో ఏ సమాచారం ఉంటే దాని ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్ చేపట్టడంతో క్షేత్రస్థాయిలో భారీగా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వీటన్నింటినీ సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది.ఈ విధానంలో భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఇక నుంచి భూమిని సర్వే చేయడం తప్పనిసరి చేశారు. ఇందు కోసం మొదట ఇంటిగ్రేటెడ్ పోర్టల్లో భూ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ భూమికి సంబంధించిన రెవెన్యూ దస్త్రాలు, సర్వే శాఖ వద్ద ఉన్న వివరాలతో సరిహద్దు రైతులకు సర్వేయర్లు నోటీసులు ఇస్తారు. తోటి రైతుల సమక్షంలోనే భూమిని సర్వే చేసి తహసీల్దార్లకు రిపోర్టు అందిస్తారు. ఆ తర్వాత రెవెన్యూ శాఖ.. రైతుకు సర్వే పటం జారీ చేస్తుంది. ఆ సర్వే పటం ఆధారంగా భూ భారతి పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేలో ఎంత భూమి అయితే ఉంటుందో.. అంత భూమికే రిజిస్ట్రేషన్ చేస్తారు.రైతు చేసుకున్న దరఖాస్తుతోపాటు సర్వే పటం ఆధారంగా తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కలిసి.. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి చేసి పట్టాదార్ పాసుపుస్తకాన్ని జారీ చేయనున్నారు. దీంతోపాటు రైతుకు భూధార్ కార్డును కూడా జారీ చేస్తారు. ఆ భూదార్ కార్డులో భూమికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరుస్తారు. భూదార్ కార్డులో ప్రత్యేక సంఖ్య ఉండటం వల్ల దాన్ని మార్చడానికి వీలు లేకుండా చేశారు.

ఈ ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో రైతులే స్వయంగా భూమి నక్షా, భూమి మార్కెట్ విలువ సహా కీలక విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇక తమ పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా కలుపుకుని.. చాలా మంది రైతులు పంట సాగు చేస్తూ ఉంటారు.

ఇక అలాంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ సమయంలో దొరికిపోనున్నాయి.

## జీడిమెట్లలో భారీ అగ్ని ప్రమాదం

మేడ్చల్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రాంరెడ్డి నగర్లో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ డ్రమ్ముల గోదాంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. మంటల తీవ్రతకు కెమికల్ డ్రమ్ములు భారీ శబ్దాలతో పేలుతూ రోడ్లపైకి ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకోవడంతో, స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంతో ఆందోళనలో స్థానికులున్నారు

మరోవైపు, దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న ఓ డెకరేషన్ సామగ్రి గోదాంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న ఇంటికి కూడా అంటుకున్నాయి.

## యానం లో పోలింగ్ షురూ

యానం గురువారం నాడు కేంద్రపాలిత యానాం (పుదుచ్చేరి)లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం అయ్యాయి. 37,972 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోటి బరిలో 13 మంది అభ్యర్థులు వున్నారు. ఎన్.ఆర్ కాంగ్రెస్ నుండి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాంగ్రెస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, టివికే పార్టీ నుండి తోట రాజు పోటీ చేస్తున్నారు. ఉ.7 గం.ల నుండి మొదలైన పోలింగ్.. సా.6 గంటల వరకు ఓటింగుకు అవకాశం వుంది. 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసారు. అందులో ..13 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారులు దృష్టిసారించారు.

### మూడు నెలల్లో వరంగల్ విమానాశ్రయానికి ఫౌండేషన్

హైదరాబాద్ తెలంగాణలో విమానయాన రంగాన్ని విస్తరించడంలో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి మరో మూడు నెలల్లో ఫౌండేషన్ వేయబోతున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి కూడా మార్గం సుగమమైంది. రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం మరో 450 ఎకరాలు భూమి సేకరిస్తే.. ఈ ఎయిర్పోర్ట్ రూపుదిద్దుకుంటుందని అన్నారు. రక్షణ శాఖ వ్యూహాత్మక ప్రాంతం కావడంతో డిఫెన్స్ మినిస్ట్రీనే దీనిని నిర్మిస్తుంది. సివిల్ ఏవియేషన్ శాఖ ప్రత్యేక టర్మినల్ను ఏర్పాటు చేస్తుంది. ఏప్రిల్ 17న ఎాబూ సర్వే నిర్వహించి, ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్ను ఖరారు చేస్తామని అన్నారు.

# పచ్చనిదంతా మామిడి కాదు...

హైదరాబాద్ ఏప్రిల్ 9, వేసవి కాలం వచ్చిందంటే చాలు.. అందరికీ ముందుగా గుర్తొచ్చేది తియ్యని మామిడి పండ్లు. కానీ, ఈ ఏడాది హైదరాబాద్ మార్కెట్లలో మామిడి పండ్ల కొనుగోలుపై జనం ఆందోళన చెందుతున్నారు. పండ్లను త్వరగా పండించడానికి వ్యాపారులు వాడుతున్న ప్రమాదకర రసాయనాల వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని వార్తలువినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్యాల్షియం కార్బైడ్ వాడకంపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి ఈ వేసవిలో మనం తినే మామిడి పండ్లు ఎంతవరకు సేఫ్? ఆ వివరాలు చూద్దాం.. ఓపెన్ ఏఐ సంచలన రిపోర్టు..మామిడి పండ్లు సహజంగా పండాలంటే సమయం పడుతుంది. కానీ, మార్కెట్లోకి అందరికంటే ముందుగా పండ్లను తెచ్చి లాభాలు గడించాలని కొంతమంది వ్యాపారులు క్యాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని వాడుతున్నారు. ఇక ఇది పండ్లను బయటకు చాలా అందంగా, పచ్చగా కనిపించేలా చేస్తుంది. కానీ, లోపల మాత్రం అవి విషపూరితంగా మారుతున్నాయి. ఈ రసాయనం వల్ల పండ్లలోని సహజమైన రుచి, పోషకాలు నశించిపోతాయి. ఇక పండ్లు కొనేటప్పుడు అవి మరీ పసుపు పచ్చగా మెరిసిపోతుంటే కాస్త జాగ్రత్తగా ఉండటం మంచిది. ఈ రసాయనాలతో పండిన పండ్లను తింటే వెంటనే వాంతులు, కడుపునొప్పి, తల తిరగడం వంటి సమస్యలు రావచ్చు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వీటిని తింటే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఇక దీర్ఘకాలంలో ఇలాంటి కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల కిడ్నీలు, కాలేయంపై ప్రభావం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పండ్లను ఆరోగ్యకరమైన ఆహారంగా భావించి తినే సామాన్యులకు, ఇలాంటి రసాయనాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.అధికారులు మేల్కోవాల్సిన సమయం: హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లలో ఇప్పటికే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. అయితే, కేవలం ఒకట్రెండు సార్లు తనిఖీలు చేస్తే సరిపోదని, సీజన్ మొత్తం నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ఇక నిబంధనలు అతిక్రమించి హానికరమైన రసాయనాలు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లకు వచ్చే పండ్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించడం ద్వారానే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వగలం. ఆహార భద్రత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు మార్కెట్‌లో పండ్లు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరం. పండు మొత్తం ఒకే రంగులో ఉండి, మరీ ఆకర్షణీయంగా ఉంటే అది రసాయనాలతో పండిందేమో అని అనుమానించాలి. సహజంగా పండిన పండ్లు అక్కడక్కడా కొంచెం పచ్చగా, కొంచెం పసుపుగా ఉంటాయి. పండ్లు తెచ్చిన తర్వాత వాటిని కనీసం అరగంట పాటు నీళ్లలో నానబెట్టి, బాగా కడిగిన తర్వాతే తినాలి. వీలైతే విశ్వసనీయమైన రైతుల వద్ద లేదా ఆర్గానిక్ స్టోర్లలో పండ్లను కొనుగోలు చేయడం ఉత్తమం. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు.. అందుకే కేవలం రంగును చూసి పండ్లను కొని మోసపోకండి. మనం కొంచెం జాగ్రత్తగా ఉంటే, మన కుటుంబాన్ని ఈ రసాయన ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. అధికారులు, వ్యాపారులు, ప్రజలు.. అందరూ బాధ్యతగా ఉంటేనే ఈ వేసవిలో తియ్యని మామిడి పండ్లను నిశ్చింతగా ఆస్వాదించగలం..

# భర్తను చంపిన భార్య



మల్కాజ్ గిరి అన్నదమ్ములతో కలిసి భర్తను హతమార్చిన భార్య చీరతో ఉరివేసి, తలను నేలకేసి కొట్టి హత్య చేసిందని ఆరోపిస్తున్న మృతుడి తల్లి మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన భార్య సోనితో కలిసి జీవనోపాధి కోసం 16 ఏండ్ల క్రితం హైదరాబాద్కు వచ్చి ఘట్కేసర్ మండలం, అన్నోజిగూడలోని లక్ష్మీనరసింహ కాలనీలో నివసిస్తూ కూలీలుగా పనిచేస్తున్న రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం, కర్కల్ పహాడ్ గ్రామం, నార్లకుంట తండాకు చెందిన జాతవత్ నరేందర్ (40) వారికి కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, కుమారుడు హాస్టల్లో ఉంటూ చదువుకుంటుండగా.. తల్లిదండ్రుల దగ్గర ఉంటూ చదువుకుంటున్న కుమార్తె అయితే నరేందర్, సోనీలకు మద్యం సేవించే అలవాటు ఉండడంతో.. మద్యం మత్తులో తరచుగా గొడవ పడుతున్న భార్యాభర్తలు నిన్న ఉదయం 10 గంటలకు నరేందర్ మరణించాడని, అతని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారని మృతుడి తల్లికి సమాచారం అందించిన పోలీసులు తన కుమారుడిది సహజ మరణం కాదని, కోడలు సోని పథకం ప్రకారం ఆమె సోదరులు నానావత్ రమేశ్, నానావత్ భాస్కర్ల సహకారంతో నరేందర్ మెడకు చీరతో ఉరివేసి, తలను నేలకేసి కొట్టి హత్య చేసిందని, దీంతో తలకు తీవ్ర గాయాలై మరణించాడని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసిన నరేందర్ తల్లి ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మార్క్ ఫెడ్ అధికారులపై ఎమ్మెల్యే సంజయ్ మండిపాటు

హైదరాబాద్ నెల రోజులుగా మక్కలు ఎప్పుడు కొంటారని రైతులు రోడ్ల మీద ఎదురు చూస్తుంటే మజాక్ గా ఉందా అని డాక్టర్ సంజయ్ మండిపడ్డారు. ఎందుకింత అహంకారం మీకు, ఈరోజు వెంటనే మొక్కజొన్న కేంద్రాలను అధికారులు తెరవకుంటే, నేను వెళ్ళి తెరుస్తానని అన్నారు.కోరుట్ల నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో జాప్యంపై మార్క్ ఫెడ్ అధికారులపై మండిపడ్డారు. రైతులు నెల రోజుల నుండి ఇబ్బందులు పడుతుంటే మీకు కామెడీగా ఉందా? మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించమంటే నాలుగు రోజుల తర్వాత తెరుస్తామని అంటారా? ఇదేనా మీ బాధ్యత అని నిలదీసారు. ఈరోజు నేను వెళ్ళి మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభిస్తాను.. మీరు వస్తారా రారా మీ ఇష్టం అంటూ మార్క్ ఫెడ్ అధికారులపై మండిపడ్డారు.

# 42 ఏళ్ల తరువాత సొంత ఇంటికి తిప్పిరి తిరుపతి

జగిత్యాల మావోయిస్ట్ పార్టీ మాజీ అగ్రనేత దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి గురువారం నాడు కోరుట్లకు చేరుకున్నారు. దాదాపు 42 ఏళ్ల తర్వాత స్వంత ఇంట్లో అడుగుపెట్టారు. లొంగిపోయి అనంతరం నెల రోజుల పాటు ఇప్పటి వరకు తిప్పిరి తిరుపతి హైదరాబాద్ లోనే ఉన్నారు. కుటుంబసభ్యులు హైదరాబాద్ వెళ్లి స్వంత ఇంటికి రావాలని తీసుకు వచ్చారు. అయనకు సన్మానం చేస్తూ చిన్ననాటి మిత్రులు స్నేహితులు స్వాగతం పలికారు.
దేవ్ జీ మాట్లాడుతూ స్వంత ఇంటికి రావడం చాలా సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులను కలవడం చాలా సంతోషం అని అన్నారు. రాజకీయ పరమైన విషయాలు మాట్లాడం సరి కాదు. అన్ని విషయాలు హైదరాబాద్ లోనే మీడియా తోనే మాట్లాడాను. ఇంటికి వస్తానని కలలో కూడా ఊహించలేదని అన్నారు.

# చిలకలూరిపేట లో తప్పిన పెను ప్రమాదం

చిలకలూరిపేట విజయ బ్యాంకు సెంటర్ లో టిఫిన్ హోటల్ లోకి బెలానో కారు అదుపుతప్పి వేగంగా దూసుసుకువెళ్లింది. దాంతో హోటల్ ల్లోని వస్తువులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. గంజాయి మత్తులో యువతీ యువకులు వేగంగా కారు నడిపినట్లు సమాచారం. ప్రమాద సమయంలో కారు లో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు వున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, యువతి యువకులు ను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. అనంతరం రోడ్డుపై పడి ఉన్న బోర్డును, ప్రమాదానికి గురైన కారును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్కూల్స్, కాలేజీలు ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురైయారు.

# పాదయాత్రను జయప్రదం చేయండి.

ఆత్మకూరు వి బి జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలంటూ ఏప్రిల్ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి ప్రతాప్ పిలుపునిచ్చారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వము కొత్తగా చేపట్టిన ఉపాధి హామీ పథకం వల్ల రైతు కూలీలు నష్ట పోయే ప్రమాదం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని వ్యతిరేకించాలని కోరారు. ఈ పాదయాత్ర కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ గారు కూడా పాల్గొంటున్నట్లు చెప్పారు. కావున పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఉపాధి కూలీలు కార్మికులంతా పాల్గొని పాదయాత్ర విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు మృతుజాభి,రత్నమ్మ, దేవమ్మ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# మంత్రి అనితకు ఎమ్మెల్యే చింతమనేని స్వాగతం



దెందులూరు ఏలూరు జిల్లా పర్యటన నిమిత్తం జిల్లాకు వచ్చిన హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కు అప్పన్నవీడు లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు.
తరువాత మంత్రి అప్పన్నవీడు అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆమెకు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు.
హోం శాఖ మంత్రి అనిత కి సాంప్రదాయ బద్దంగా చీర, సారెను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందించారు. కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే జిల్లా పార్టీ అధ్యక్షులు బడేటి చంటి, రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సహా కూటమి నాయకులు పాల్గోన్నారు.

# కార్మిక వర్గం, కష్టజీవుల హక్కుల దినోత్సవం"మేడే"కార్యక్రమం విజయవంతం

**ప్రపంచ కార్మిక దినోత్సవం"మే డే"స్ఫూర్తితో కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి.**

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురి జాల శ్రీధర్ పిలుపు.**

**ఈరోజు బోయిన్పల్లి మండలం నీలో జ్ పల్లి గ్రామంలో హ మాలి కార్మికుల ఆధ్వర్యంలో మే 1న జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం 140,వ, "మే డే"కార్యక్రమం ,**

ఉద్యోగ భద్రత మరియు ఇతర హామీలను అమలు చేయకుండా కార్మిక వర్గానికి నష్టం చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ"మే డే"స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరుగుతుంది. మే 1వ, తేదీన జరిగే మేడే



బోయినపల్లి మండల కేంద్రములో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈరోజు,నీలోజ్ పల్లి లో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ×ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం వెట్టి చాకిరి విముక్తి కోసం, కార్మికులకు కనీస హక్కులు ఉండాలని సాగించిన వీరోచిత పోరాటం ద్వారా కార్మిక వర్గానికి కొన్ని హక్కులు వచ్చాయని ఆ పోరాటంలో ఎంతో మంది రక్తం చిందించి ప్రాణాలర్పించడం జరిగిందని ఆ పోరాటంలో అమరులైనటువంటి వారి త్యాగాల గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి కార్మిక వర్గం, కష్టజీవులు అందరూ మే 1వ తేదీన కార్మికుల హక్కుల పోరాట దినోత్సవం,మండల కేంద్రములో జరిగే,"మే డే"కార్యక్రమానికి మండలంలో ఉన్న అన్ని రంగాల కార్మికులందరూ,పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరుగుతుంది. కేంద్ర ములో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ,8, గంటల పని ని పెట్టుబడిదారులకు, వ్యాపారవేత్తలకు అనుకూలంగా కార్మిక వర్గాన్ని మళ్లీ బానిసత్వంలోకి నెట్టే విధంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చినటువంటి వేతనాల పెంపు, దినోత్సవం బోయిన్పల్లి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది కాబట్టి, ఇక్కడ ఉన్న ఈ ప్రాంతం వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ తమ వంతు ఆర్థిక, సహాయ సహకారాలు అందించి"మే డే"కార్యక్రమాల విజయవంతంలో భాగస్వాములు కావాలని కార్మిక వర్గానికి బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మరియు,నిలో జ్ పల్లి హ మాలీ సంఘం అధ్యక్షులు, సింగి రెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల మల్లయ్య, కొనుకటి రవీందర్, లింబద్రి,తదితరులు పాల్గొన్నారు.

# ఘనం గా ఎన్ ఎస్ యూ ఐ ఆవిర్భవ దినోత్సవం

హైదరాబాద్ ఎన్ ఎస్ యూ ఐ 56వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా కోట దుర్గారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి హాజరై ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పోటీ పరీక్ష పుస్తకాలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ ఎస్ యూ ఐ అనేది ఇందిరగాంధీ ఆలోచన విధానంతో పుట్టుకొచ్చిన విద్యార్థి సంఘం అన్నారు. అనేక యూనివర్సిటీ కాలేజీలలో కమిటీ వేసుకొని ఏర్పాటు చేసుకుంది. అనేక ముఖ్యమంత్రులను కేంద్ర మంత్రులను చేసింది ఎన్ ఎస్ యూ ఐ విద్యార్థి సంఘం అని గర్వాంగా చెపుతున్నాం అని అన్నారు . 55 సంవత్సరాల నుండి దేశంలో నలు మూలలనుండి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన ఎన్ ఎస్ యూ ఐ సంఘం ముందు ఉండి పోరాడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థి నాయకులు, విద్యార్థి, విద్యార్థినిలు పాలుగోన్నారు. ..

## జగన్ పై టిడిపి నేత బుద్దా వెంకన్న ఫైర్

విజయవాడ మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ నేత బుద్దా వెంకన్న మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి చెప్పిన మావిగన్ సూత్రాన్ని చూసి ప్రజలు ఛీ కొట్టారు. వారికి వంత పాడుతున్న వందమాదిగల తీరును వేమూరి రాధాకృష్ణ చెప్పారు. డైవర్షన్ పాలిటిక్స్ లో ఆరితేరిన జగన్ మావిగన్ ట్రోల్స్ నుంచి తప్పుకునేందుకు రాధాకృష్ణ మీద పడ్డాడని అన్నారు.
ద్రబాబు, లోకేష్ లకు ఆంధ్రజ్యోతి కి ఏంటి సంబంధం. పత్రిక కార్యాలయం పై దాడి చేస్తే ఖండించకూడదా. రాధాకృష్ణ పై దాడి చేస్తా, అరెస్టు చేస్తా అని బెదిరిస్తావా. ముందు నీ సాక్షిలో రాసిన నీచపు రాతలకు నిన్ను ఎన్నిసార్లు కొట్టాలి , ఎన్నిసార్లు అరెస్టు చేయాలి. నీ తల్లి విజయమ్మ నీ గురించి లేఖ రాస్తే నీ పత్రికలో రాశావా. అమరావతి మహిళలు వేశ్యలు అంటే... నీ సాక్షిలో రాశారు. భారతీరెడ్డి వాళ్లకు క్షమాపణ లు ఎందుకు చెప్పలేదు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణిని అవమానిస్తే మద్దతు పలికింది నీవు కాదా అని ప్రశ్నించారు.
చంద్రబాబు, లోకేష్ ఖండించ లేదని మాట్లాడే హక్కు నీకు ఉందా. సొంత చెల్లి నే తిట్టించిన నువ్వా మహిళల హక్కు ల గురించి మాట్లాడేది. నీ మావిగన్ ట్రోల్స్ కాకుండా ఉండదుకే రాధాకృష్ణ పై బురద జల్లుతున్నావు. నీవు చెప్పినట్లు రాయని చానల్స్, పత్రికలను బెదిరిస్తావా.. నీ పాదయాత్ర తో చంద్రబాబు కు సినిమా చూపిస్తావా . గతంలో రాంగోపాల్ వర్మ తో నువ్వు సినిమాలు తీయిస్తే ప్రజలే ఛీ కొట్టారు. లోకేష్ బాబు తన పాదయాత్ర ద్వారా నీకు ఇప్పటికే సినిమా చూపించాడుగా . చంద్రబాబు వరకు అక్కర్లేదు... లోకేష్ బాబు కే ట్రైలర్ చూపించ లేవు. సాక్షి పేపర్ పెట్టిన నాటి నుంచీ నీ ఎంపి నుంచి సర్పంచ్ వరకు ఒక్క వార్త రాశావా. గత ఐదేళ్ళ పాలనలో వేల కోట్లు దోచుకుంది మీరు. ఒక్క అవినీతి గురించి అయినా నీ సాక్షి లో రాశావా. చంద్రబాబు, లోకేష్ లకు నీలాగా పత్రికలు లేవు. అమరావతి మహిళలను నీచంగా మాట్లాడింది మీ వైసిపి నేతలు కాదా. ఏనాడైనా తప్పు గా మాట్లాడాం అని మీరు క్షమాపణ చెప్పారా. రాధాకృష్ణ మహిళలను ఎక్కడ అవమానించారు. నీ చుట్టూ ఉన్న వారు నువ్వు తానా అంటే తందానా అంటున్నారని ఘాటుగా చెప్పారు. నీకే సినిమా అయిపోయింది... వచ్చే ఎన్నికలలో ప్రజలే నిన్ను తరమి కొడతారు. నీకు అసలు నీతులు చెప్పే కనీస అర్హత ఉందా అని అన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత హెచ్ఓడిలతో సమీక్ష సమావేశం

### జిల్లా ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలి
### జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, జిల్లా కు రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై జాయింట్ కలెక్టర్. ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు లతో కలసి సంబంధిత హెచ్ఓడిలతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్. డా, ఎస్. వెంకటేశ్వర్ బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా,మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్సిఎం ద్వారా మంజూరైన పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలు వంటి కీలక రంగాల్లో మంజూరైన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిపై వారానికొకసారి సమీక్ష నిర్వహించి, ఎటువంటి ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే, పనుల అమలులో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం పొందాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన మంజూరుల వివరాలు, ప్రస్తుత పురోగతి, ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్కు వివరించారు.ఈ సమావేశంలో ఏ ఎస్పి రావిమనోహరచ్చారీ, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్. శివకుమార్, ఇరిగేషన్ డి ఈ, రాధా కృష్ణా, ఆర్ అండ్ బి ఎస్ ఈ, రాజా నాయక్, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సివిల్ సప్లై అధికారి శేషు రాజు, ఏ పి ఎమ్ ఐ పి పి డి చిన్న రెడ్డయ్య, గృహనిర్మాణం శాఖ పి డి, ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ జగదీష్,పంచాయతీ రాజ్ ఎస్ ఈ మధుసూదన్, అటవీ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## జ్యోతి నగర్లో నూతన బోరు ఏర్పాటు
### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాలతో త్రాగునీటి సమస్యకు ఉపశమనం...



రేణిగుంట మండలంలోని జ్యోతి నగర్, రమణ విలాస్ సర్కిల్ వద్ద త్రాగునీటి సమస్య పరిష్కారానికి కీలక చర్యగా నూతన బోరు ఏర్పాటు చేపట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు,రేణిగుంట తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బోరు త్రవ్వక పనులు ప్రారంభించి, పూజలు నిర్వహించిన అనంతరం బోరు ఏర్పాటు చేశారు.ఈ బోరు ఏర్పాటు ద్వారా గ్రామంలో త్రాగునీరు, సాగునీటి సమస్యలు కొంతవరకు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తీసుకున్న చర్యకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ బోరు ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. జ్యోతి నగర్ ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి చంద్ర, ఆర్డబ్ల్యుసి సిద్ధారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదం, యూనిట్ ఇంచార్జి బాబు, మేరీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## పంటను దోచుకున్నారు
## దళిత రైతు భార్య అవేదన

మైలవరం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను తరలిస్తుండగా అడ్డగించి, నిందితులు లారీ తాళాలు లాక్కున్నారని రైతు భార్య రుక్మిణి అరోపించింది. మైలవరం మండలం తోలుకోడులో దళిత రైతు కుటుంబం పై ముగ్గురు వ్యక్తులు తమ బలగంతో పాశవిక దాడికి పాల్పడ్డారని ఆరోపించింది. కులం పేరుతో దూషిస్తూ, పొత్తు కడుపులో తన్ని, చీర లాగారని బాధితురాలి ఆవేదన.

ట్రాక్టరును అడ్డుపెట్టి రాత్రంతా లారీని, రైతు కుటుంబాన్ని అక్రమంగా నిర్బంధించారు. గుండె వ్యాధితో ఉన్న భర్త ప్రసాద్ను కూడా కనికరం లేకుండా శారీరకంగా హింసించారు. నిందితులు కుల వివక్షతో బెదిరింపులకు దిగారని వెల్లడించింది.

ఎమ్మెల్యే అండ ఉందంటూ రాయల శ్రీను అనే వ్యక్తి తమను చిత్రహింసలకు గురిచేస్తున్నారని రుక్మిణి ఆరోపించింది. దళితులను కాపాడి,తమకు రక్షణ కల్పించాలంటూ సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్లకు వేడుకుంది.

## మాచవరంలో మంచినీటి చలివేంద్రం ప్రారంభం




మాచవరం, మండల కేంద్రమైన మాచవరం కిరాణా మర్చంట్ బజార్లో గురువారం వివిధ గ్రామాల నుండి వచ్చే బాటసారులకు , స్థానికులకు మినరల్ వాటర్ కూలింగ్ చలివేంద్రాన్ని గురువారం నిర్వాహకులు సూరే నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. గత 30 సంవత్సరాలకు పైగా ఈ చలివేంద్రాన్ని సూరే వెంకట సుబ్బారావు కుమారులు సూర్య వెంకటేశ్వర్లు, సూరే నాగేశ్వరరావు సప్తగిరి ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరేటి వెంకటేశ్వర్లు, రామయ్య, తీరం దాసు, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు
### ప్రారంభించిన ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ నగరం ఎంతో మంది కుస్తీ వీరులను అందించిందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయిలో రెజ్లింగ్ ఛాంపియన్స్ గా నిలిచారని తెలిపారు. హైదరాబాద్ కోఠి లోని విక్టోరియా ప్లే గ్రౌండ్స్ లో అండర్ 17 హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల యువత ప్రతిభ ఉన్నప్పటికీ జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో రాణించలేకపోతున్నారని పేర్కొన్నారు. కుస్తీ పోటీల వల్ల శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఒక ప్రణాళిక రూపొందించి , కుస్తీ ఆటకు పూర్వ వైభవం తీసుకొస్తామని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

## సూరేపల్లి లో మీ భూమి- మీ హక్కు కార్యక్రమం పాల్గొన్న సీఎం చంద్రబాబు





బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గం, సూరేపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజావేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

## ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



రాయచోటి ,ఏప్రిల్ 09: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ జాబీర్ ప్రధాన కార్యదర్శి గఫార్ ఖాన్ డిమాండ్ చేశారు ఫ్యాప్టో ఆధ్వర్యంలో రేపు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల రాయిచోటిలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పిఆర్సీని వెంటనే నియమించాలని 29 మధ్యంతర భృతి ప్రకటించాలని పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని సంపాదిత సెలవులనగదును వెంటనే చెల్లించాలనే 18 డిమాండ్స్ తో బాలికోన్నత పాఠశాల నందు గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు నిరసన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు అంకం శివారెడ్డి, రవిశంకర్, పల్లం రామచంద్ర, సివి రమణ, నాగముని రెడ్డి హరిబాబు, రామకృష్ణ, సిబాతుర్ రెహమాన్, రవీంద్రనాథ్ రెడ్డి, ఇలియాజ్× తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి కామ్రేడ్ చంద్రా రాజేశ్వరరావు ను ఆదర్శంగా తీసుకోవాలి
### సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి




దాచేపల్లి, :నేటితరం నాయకులు అమరజీవి కామ్రేడ్ చంద్రా నాగేశ్వరరావు ని ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి అన్నారు. గురువారం నారాయణపురం సిపిఐ మండల కార్యాలయంలో రాజేశ్వరరావు 32వ వర్ధంతి జరిగింది. రాజేశ్వరరావు చిత్రపటానికి బుర్రి కృష్ణారెడ్డి తెలనాకుల సత్యనారాయణ పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, రాజేశ్వరరావు జమీందారు కుటుంబాలలో జన్మించారని బెనారస్లో డాక్టర్ చదువుతూ భారత స్వతంత్ర పోరాటంలో పాల్గొనడానికి ఇండియా వచ్చారు. రాజేశ్వరరావు కార్ల మార్బ్క లెనిన్ ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు పార్టీలో చేరినారు తనకు వచ్చిన ఆస్తి మొత్తం పేద ప్రజలకు పంపిణీ చేశారు అన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆటలు పాటలు పెట్టి యువకులను చైతన్య పరిచినారు. రాజేశ్వరరావు ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీకి సిపిఐ జాతీయ కార్యదర్శిగా 24 సంవత్సరాలు పని చేశారు. రాజేశ్వరరావు అనేక దేశాలలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ వేదికల మీద ప్రసంగించారు. దేశంలో రాజేశ్వరరావు నాయకత్వంలో ప్రజలకు సాగుభూమి నివేశి స్థలాలు లక్షలాది ఎకరాలు పంపిణీ చేశారని అన్నారు మతతత్వ శక్తులకు ఎదురొడ్డు పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కొమెర వెంకటరావు, ప్రత్తిపాటి వెంకట నాగరాజు, రేవూరి రామయ్య, తమ్మిశెట్టి శ్రీరాములు, వి. వెంకటేశ్వర్లు, ఎస్కే ముస్తఫా, యెద్ల భాస్కర్, కోళ్లూరు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు ఘనస్వాగతం



కరీంనగర్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పుట్టా మధు, దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, బిగాల గణేష్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు తుల ఉమ, రాకేష్, కొండూరి రవీందర్ రావు తదితరులు హాజరయ్యారు. తరువాత కేటీఆర్ మరియు ఇతర బీఆర్ఎస్ నేతలు జగిత్యాలకు బయలుదేరారు.

## బి ఆర్ ఎస్ వి పోరుబాట

ముసారాంబాగ్ మూసి పరివాహక ప్రాంతం వాంబే బస్తి వాసులకు బాసటగా నిలుస్తామంటూ బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం నాయకులుమరియు ముసరాంబాగ్ బిఆర్ఎస్వి నాయకుడు నరేష్ యాదవ్ బస్తీలో పర్యటించి మూసి బాధితులకు అండగా ఉంటాను భరోసా ఇచ్చారు.నరేష్ మాట్లాడుతూ ఇక్కడ మా ఇల్లును కూలిస్తే అక్కడ మీ ఇంటికి 100 బుల్డోజర్లు పంపి ఇంటితోపాటు నిన్ను నీ టీం ని బుల్లోజర్ల కింద చేసి తొక్కి స్తామనిరేవంత్ రెడ్డి జాగ్రత్త నీ లుచ్చా రాజకీయాలు మానుకో పేద ప్రజలందరూ కూల్చడం మానుకో మా పేదల జోలికి వస్తే మీ అంతు చూసేదాకా వదల అంటూ హెచ్చరించారు...

# ఆలమూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు.



రుద్రవరం. మండలంలోనిఆలమూరు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి డాక్టర్ నాగ ప్రసన్న ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి గొల్లపాములేటి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటులో భాగంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి డాక్టర్ నాగ ప్రసన్న మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దటిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు ఇంటింటి చెత్తసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పాములేటి నిఆదేశించారు. ఈ కార్యక్రమంలోశిలబోయిన చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు పత్తిబ్రహ్మయ్య.టిడిపి నాయకులు పత్తి బాచేపల్లి నారాయణ . పత్తిలక్ష్మినారాయణ. ఉపాధి హామీ సహాయకుడు గురప్ప మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడులు గల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి...
## మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు

తుగ్గలి : తక్కువ పెట్టుబడులు గల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లిని ముందుగా సాగు చేయడం వల్ల రైతులు చాలా సమస్యలను ఎదుర్కోవాలని ఆయన తెలియజేశారు. ఒకేసారి పెద్ద మొత్తంలో మార్కెట్లోకి ఉల్లి రావడం వల్ల ధరలు చాలా వరకు తగ్గుతాయని,ఆగస్టు మరియు సెప్టెంబర్ నెలల్లో మేఘావృతమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఉల్లిపాయలు సరిగ్గా ఎండకపోవడం వలన ఉల్లి దుంపలు కుళ్ళిపోవడం,నిరంతర మేఘావృత వాతావరణం కారణంగా సరిగా ఉల్లిగడ్డ గట్టిపడకపోవడం,అధిక తేమ శాతం కారణంగా నిల్వ నాణ్యత తగ్గిపోవడం ద్వారా మార్కెట్ నందు ఉల్లిగడ్డకు డిమాండ్ తగ్గి ధరలు పతనమవుతాయని ఆయన తెలియజేశారు.పండించిన ఉల్లి ధరలు పతనమవడంతో రైతులు చాలావరకు నష్టపోతారని ఆయన తెలియజేశారు. కావున తక్కువ పెట్టుబడులు గల ప్రత్యామ్నాయ పంటలైనటువంటి ఆముదం,కంది,సజ్జ మరియు నీటి సదుపాయం ఉన్న రైతులు వేరుశెనగ, కంది,ఆముదం,పెసర పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ మండలం నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సామల నవీన్ కుమార్






కోహెడ సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన సామల నవీన్ కుమార్. జిల్లా కలెక్టర్ మంగళవారం తహసిల్దారులను డిప్టేషన్పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇట్టి ప్రక్రియలో భాగంగా కోహెడ మండలం తహసీల్దారుగా సామల నవీన్ కుమార్, నయాబ్ తహసిల్దార్ కోహెడ, తహసిల్దార్ పిఎసి గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు.మరియు మండల గిర్ధవార్ గా ఆర్. సంజీవ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు బి. రాములు, గిర్ధవార్ బి. ఎల్లయ్య, మండల సర్వేయర్ జైపాల్ గౌడ్, గ్రామ పాలన అధికారులు, మీ సేవ, భూభారతి ఆపరేటర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొని నూతన తహసిల్దార్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు.

## కొలిమిగుండ్లలో ఈనెల 11న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటన...

కొలిమిగుండ్ల గ్రామంలో ఈనెల 11న రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి గురువారం నాడు తెలిపారు. ముందుగా కొలిమిగుండ్ల మండల కేంద్రంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం మండలంలోని 15 గ్రామాలలో నూతనంగా నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. అనంతరం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొని తన ప్రసంగాన్ని వినిపిస్తారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మూలే రామేశ్వర్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర్ రెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జి వి ఆర్ లక్ష్మీరెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కృష్ణ రంగారెడ్డి, గొంగటి హుస్సేన్ రెడ్డి, అంబటి వివేకానంద రెడ్డి, అంబటి ప్రకాష్ రెడ్డి, లోకే పల్లె మధుప్రసాద్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రమణమ్మ, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలోనే మిస్సింగ్ బాలిక ఆచూకీ లభ్యం
## కేడీపేట పోలీసుల సత్వర స్పందన



నర్సీపట్నం రూరల్, ఏప్రిల్ 09: నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలోని కేడీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు ఉదయం అదృశ్యమైన ఒక బాలికను పోలీసులు అత్యంత వేగంగా స్పందించి సురక్షితంగా గుర్తించారు. కేసు నమోదైన కేవలం మూడు గంటల్లోనే బాలిక ఆచూకీ కనిపెట్టి, తల్లిదండ్రుల చెంతకు చేర్చడం పోలీసుల సమర్థతకు నిదర్శనంగా నిలిచింది.సంఘటన వివరాలు ఈ రోజు ఉదయం సుమారు 8:30 గంటలకు బాలిక మిస్సింగ్ అయినట్లు తల్లిదండ్రుల నుండి ఫిర్యాదు అందింది.నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నర్సీపట్నం రూరల్ సి.ఐ. రేవతమ్మ పర్యవేక్షణలో కేడీపేట ఎస్సై రిషికేష్ రావు తన సిబ్బందితో కలిసి తక్షణమే రంగంలోకి దిగారు.ఈ ఆపరేషన్ కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.పోలీసు బృందాలు క్షేత్రస్థాయిలో గాలిస్తూనే, మరోవైపు సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి సమన్వయంతో వ్యవహరించారు. ఈ క్రమంలో బాలిక తూర్పు గోదావరి జిల్లా గండిపేట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే అక్కడికి చేరుకుని బాలికను సురక్షితంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెను సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించి, వారికి భరోసా కల్పించారు.సకాలంలో స్పందించి, చాకచక్యంగా వ్యవహరించి గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన నర్సీపట్నం రూరల్ సి.ఐ. రేవతమ్మను, కేడీపేట ఎస్సై రిషికేష్ రావును మరియు వారి సిబ్బందిని డీఎస్పీ పి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

# రుద్రవరం మండలం తాసిల్దార్ గా నాగ వీణ.



రుద్రవరం మండలం తాసిల్దారుగా నాగవీణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తాసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ధోనిగ్రేడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంగళగిరి లోని భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ కార్యాలయంలో సిసిఎల్ఏ గా విధులు నిర్వహిస్తున్న నాగ వీణను రుద్రవరం మండల తాసిల్దారుగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ రైతు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన తాసిల్దారును అధికారులు సన్మానించారు.

## అత్యా ధునిక హంగులతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనం ను ప్రారంభించిన హోం మంత్రి అనిత



ఏలూరు మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, భవిష్యత్ అవసరాలకు అను గుణంగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యా లయ ప్రాంగణం నకు అతి సమీపములో నిర్మించిన నూతన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనిత ప్రారంభించారు.

సుమారు 30 సెంట్ల విస్తీర్ణంలో, 2 కోట్ల 73 లక్షల రూపాయల భారీ వ్యయంతో అన్ని రకాల హంగులతో ఈ రెండం తస్తుల భవనాన్ని నిర్మించారు.?? భవనము లో శిశు సంరక్షణ కేంద్రం స్టేషన్ కు వచ్చే మహిళలతో పాటు వారి చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా' మరియు అవసరమైన సదుపాయాలను కల్పించడం ఈ భవనం యొక్క ప్రత్యేకత.

ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ ఈ రోజు పెదపాడు ను ప్రారంభిం చినట్లు ముందుగా నిర్వ హించిన పోలీస్ స్టేషన్ యొక్క స్థితి గతులను చూసి తాను ఎంతో ఆవేదన చెంది నట్లు అటువంటి వసతులు లేనటువంటి ప్రాంతంలో ఉద్యోగ నిర్వహణ చేసినటు వంటి ఆ పోలీస్ స్టేషన్ అధికారులను అభినందించినారు.

# రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి




హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి చెందింది. అంబర్పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో ఈ ఘటన చోటు చేసుకుంది.

నడుచుకుంటూ వస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు ఎం పుష్ప పై బస్సు టైర్ పడి మృతి చెందింది. అంబర్పేట్ అలీ కేఫ్ చౌరస్తాలో జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికురాలుగా విధులు నిర్వహిస్తుంది. విషయం తెలుసుకున్న అంబర్ పేట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# విజయవాడ టెర్రర్ కేసు:
# మరో ఆరుగురు నిందితులు పోలీసుల కస్టడీకి

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడ టెర్రర్ లింక్స్ కేసులో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో అరెస్టయిన మరో ఆరుగురు నిందితులను కొత్తపేట పోలీసులు నేటి నుంచి ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వీరిని మధ్యాహ్నం విజయవాడకు తరలించనున్నారు.ఈ నెల 13వ తేదీ వరకు వీరిని విచారించేందుకు విజయవాడ సీజేఎం కోర్టు పోలీసులకు అనుమతి మంజూరు చేసింది. అంతకుముందు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించిన ఐదుగురు నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తాజా విచారణకు రంగం సిద్ధమైంది. వారి స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ ఆరుగురి నుంచి కీలక సమాచారం రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు.ప్రస్తుతం కస్టడీలోకి తీసుకోనున్న నిందితుల్లో బిహార్‌కు చెందిన షాద్‌మాన్ దిల్కష్ (ఏ4), ఢిల్లీకి చెందిన లక్కీ అహ్మద్ (ఏ7), రాజస్థాన్‌కు చెందిన జిషాన్ (ఏ9), పశ్చిమ బెంగాల్‌కు చెందిన మీర్ ఆసిఫ్ అలీ (ఏ10), పుణెకు చెందిన షారుక్ ఖాన్ (ఏ12), మహారాష్ట్రకు చెందిన షేక్ ఫయాజ్ రెహమాన్ (ఏ13) ఉన్నారు.కాగా, ఈ కేసులో మొత్తం 13 మందిపై కేసు నమోదు కాగా, పోలీసులు ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. మిగిలిన నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచి విచారణ కొనసాగిస్తున్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టేసిన వైనం..
## తాళ్లతో చెట్టుకు కట్టి అవమానించిన గ్రామస్తులు...



సంగారెడ్డి దామరగిద్ద గ్రామంలో అమానుషం. .హెచ్‌బీఎం ఫైనాన్స్ పేరుతో అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారి భర్త ప్రభాకర్ గ్రామంలోని పలువురి వద్ద డబ్బులు తీసుకొని పారిపోయాడు.. ..దీంతో అంగన్ వాడీ టీచర్ ను తాళ్లతో చెట్టుకు కట్టి గ్రామస్తులు అవమానించారు. ఘగనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

# పోలీసులు వేధిస్తున్నారు టవరెక్కి యువకుడి నిరసన

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఎర్రబాలెంలో సెల్ ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యకి ప్రయత్నిస్తున్న యువకుడు తన మరణానికి మంగళగిరి సీఐ వీరాస్వామి డీఎస్పీ మురళీకృష్ణ అని తనపై తప్పుడు కేసులు కట్టి వేధిస్తున్నారని యువకుడు ఆరోపణ.. తనపై కేసులు కట్టమని స్థానిక అధికారి పార్టీకి చెందిన పార్టీ పెద్దలు పోలీసులకు చెప్పారని ఆ యువకుడు తన సెల్ ఫోన్ లో సెల్ఫీ వీడియో ద్వారా తన వేదనను తెలియజేశాడు..

# 1.80 కోట్లతో సీసీ రోడ్లు పనులను ప్రారంభించిన లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మ కంటి వంశాపతి రమేష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** ములుగులక్ష్మీదేవిపేట గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మంత్రి సీతక్క గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాము

తెలంగాణా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి,స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు–శ్రీమతి.డా,,దనసరి.అనసూయ సీతక్క గారి చొరవతో

వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో 1.80 కోట్ల రూపాయల సీసీ రోడ్లు పనులను కొబ్బరికాయ కొట్టి,ప్రారంభం చేసిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్/బొమ్మకంటి.వంశావతి–రమేష్

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ,మంత్రివర్యులు– చొరవతో ఇప్పటివరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా 4 కోట్ల రూపాయల పనులు జరుగగా,ఇప్పుడు కూడా మళ్లీ 1.80 కోట్లతో ప్రత్యేక చొరవతో మాపై నమ్మకంతో మంజూరు చేయించిన సీతక్క గారికి మేము లక్ష్మీదేవిపేట గ్రామ ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,పాలకవర్గం మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,జిల్లా మహిళా నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన గారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 9(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** తిరుమలతిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ చైర్మన్, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టరేట్ అవార్డు గ్రహీత సనగారి కొండల్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవాలయం సన్నిధిలో మానసిక ప్రశాంతత సంతోషం ఆనందం కేవలం దేవుని యొక్క సన్నిధిలోని ఉంటుంది దేవుని యొక్క దీవెనలు మా కుటుంబానికిగ్రామ ప్రజలకు మండల ప్రజలకు జిల్లా ప్రజలకు తెలంగాణ ప్రజలందరిని తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ధారాళంగా దయచేయాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలనిఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సనా గారి కొండల్ రెడ్డి తెలిపారు

# విద్యుత్ ప్రజా బాట కార్యక్రమం నిర్వహించిన. డి ఈ జె పురుషోత్తం




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని 12వ వార్డులో ప్రజల సమస్యల పరిష్కారానికి మరో ముఖ్యమైన అడుగు పడింది. వార్డు మెంబర్ శ్రీమతి కోయిల కృష్ణవేణి గారి ఆధ్వర్యంలో, విద్యుత్ శాఖ డీఈ జె. పురుషోత్తం మరియు ఏఈ జె. స్వామి గారి పర్యవేక్షణలో "విద్యుత్ ప్రజా బాట" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు

ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వార్డు పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డి ఈ పురుషోత్తం హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంది అని ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన వ్యక్తం చేసి, వారి సమస్యలను విద్యుత్ అధికారులకు తెలియజేశారని అన్నారు.

ఈ సందర్భంగా వార్డు మెంబర్ కోయిల కృష్ణవేణి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు తాను అందుబాటులో ఉంటానని, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

కార్యక్రమంలో రామకృష్ణ బిఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

# గంటల గుంట గుత్తి కోయ వాసుల సమస్యలు పరిష్కరిస్తాం మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9 ఏటూరు నాగారం** ఏటూర్ నాగారం మండల కేంద్రంలోని గంటల గుంట గుత్తి కోయ గుడార వాసుల సమస్యలు రోజు రోజుకి ఫారెస్ట్ అధికారులచే ఉత్పన్నమైన తరుణంలో ఫారెస్ట్ అధికారులు సాగు చేసుకున్న భూములలో ట్రంచ్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలుసుకున్న మండల నాయకులు ఆ ప్రాంతానికి చేరుకునీ గుత్తి కోయ ప్రాంతవాసుల సమస్యలు తెలుసుకుని ఫారెస్ట్ అధికారులచే ఏర్పడుతున్న సమస్యలను మంత్రి గారి దృష్టికి తీసుకుని వెళ్లి మీకు లాభం చేగురే విధంగా ఫారెస్ట్ అధికారుల తోని ఎలాంటి సమస్యలు లేకుండా మంత్రి సీతక్క మీకు అన్ని విధాల లాభం చేస్తుందని హామీ ఇచ్చారులి ఈ కార్యక్రమంలో ఆ ర్టి ఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, సొలం వెంకటనారాయణ, వేణు,ప్రశాంత్,తరుణ్, మదరి లక్ష్మి, గ్రామ నివాసులు పాల్గొన్నారు...

# హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమం




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా. వైద్యశాల సూపరెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ఐవి మరియు ఎయిడ్స్ అవగాహన కార్యక్రమానికి సామాజిక వైద్యశాల నుంచి ఐటీడీఏ వరకు వైద్య సిబ్బందితో వైద్యులతో ర్యాలీగా వెళ్లి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు

వైద్యులు సుష్మా మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు పరీక్షల నివారణ చర్యలు కౌన్సిలింగ్ సెంటర్లు మరియు చికిత్స గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యవంతులను చేయాలని వారు అన్నారు ఎయిడ్స్ మహమ్మారి ప్రాణాంతకం కాదు మందులతో వ్యాధిని నయం చేసుకోవచ్చు అని వైద్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ లిఖిత డాక్టర్ మౌనిక హెడ్ నర్స్ ఆఫీసర్స్నాగదేవి శారద విజయలక్ష్మి పద్మావతి సావిత్రి. ఫార్మసిస్ట్ విజయ్ కుమార్ స్టాఫ్ నర్స్ సిబ్బంది పాల్గొన్నారు

# కొండయి లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్. వైద్య అధికారి డా. హెచ్.ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** ఏటూరు నాగారం ఏటూర్ నాగారం మండల కేంద్రంలోని కొండాయి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా 86 మందికి ఉచిత మొబైల చెస్ట్ ఎక్స్–రే స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడం జరిగింది.క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ముఖ్యంగా దగ్గు, జ్వరం,మధుమేహం కలిగిన ప్రతి ఒక్కరూ ఎక్స్–రే స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమశీలో సర్పంచ్ ఆలం మానస,హెల్త్ అసిస్టెంట్ కోరం భాస్కర్ రావు,టీబీ సూపర్ వైజర్ రమేష్,ఎక్స్–రే టెక్నీషియన్ లక్ష్మణ్ సంతోష్,

ఏ ఎన్ఎమ్ సమ్మక్క, ఆశలు పాల్గొన్నారు.




# చెరువు లో ఇండ్ల నిర్మాణం చేసిన వారికి నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** ఏటూరునాగారం మండల కేంద్రంలోని రసూల్ కుంటలో అక్రమంగా నిర్మించిన ఇండ్లు ను తొలగించాలని బయ్యక్కపేటకు చెందిన చంద మహేష్ ఫిర్యాదు దారుడు ఏటూరు నాగారం స్థానిక ఎమ్మార్వో జగదీష్ కు ఫిర్యాదు చేయడంతో వారికి ఎమ్మార్వో ఆఫీస్ నుంచి నోటీసులు జారీ చేయబడ్డాయి దీనితో స్థానిక మండల నాయకుడు చిటమట రఘు గారి ఆధ్వర్యంలో ఇండ్లను నిర్మించుకున్న నివాసులు ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ గిరిజన సంక్షేమ అధికారిని కలిసి చాలా సంవత్సరాల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నారని చిటమట రఘు అధికారికి తెలియజేశారు 1945 ముందు ఈ ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకున్న వారికి ఇది వర్తించదని చెప్పారు దీనితో స్థానిక మండల నాయకులు మంత్రి సీతక్క గారి దృష్టికి తీసుకుని వెళ్లి మీ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ వేణు ప్రశాంత్ తరుణ్ మాదరి లక్ష్మి గ్రామనివాసులు పాల్గొన్నారు

# చంచల్ గూడ జైలు లో వైద్య శిబిరం ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింభ

హైదరాబాద్ చంచల్ గూడ జైలులో వైద్య శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఖైదీల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ని అన్ని జైళ్లలో ప్రతి మూడు నెలలకు వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలను నిర్వహించనున్నామని ప్రకటించారు.ప్రతి ఖైదీకి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయనున్న ట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా.,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ వీక్ లో భాగంగా హెచ్ఐవి ఎయిడ్స్ పై కళాకారులచే అవగాహన కార్యక్రమాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9** ములుగు జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -99 రోజుల కార్యక్రమంలో హెల్త్- వీక్ లో భాగంగా " హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్" పై అవగాహన కార్యక్రమాలు,హెచ్ఐవి స్క్రీనింగ్ క్యాంపులు మరియు వాక్ తాన్ నిర్వహించడం జరిగింది.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు , జి జి హెచ్ ఆసుపత్రి సూపర్ ఇండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ జండా ఊపి హెచ్ ఐ వి మరియు ఎయిడ్స్ ర్యాలీ నీ ఉద్దేశించి డిఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు , పరీక్షల, నివారణ చర్యలు, కౌన్సిలింగ్ సెంటర్లు మరియు చికిత్స గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యవంతులను చేయాలని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో ప్రజలు ప్రజాప్రతినిధులు యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఈ వ్యాధిని వారించవచ్చునని వివరించారు.

గ్రామాలలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి గ్రామ సభలలో ఇతర మీటింగ్ లలో మాట్లాడాలని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అనేది ఒక వైరస్ వల్ల ఒకరి నుండి ఇంకొకరికి



హెచ్ఐవి వైరస్ కలిగిన రక్త మార్పిడి వల్ల, కలుషితమైన సిరంజిలా వల్ల సురక్షితం కానీ సంభోగం వల్ల వల్ల ఒకరి నుండి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుందని, కరచాలనము టాయిలెట్స్ ద్వారా ఈ వ్యాధి వ్యాపించదని వివరించారు. అనంతరం జిజిహెచ్ లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాల్లో జి జి హె చ్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీ హెచ్ఐవి పరీక్షలు చేసుకోవాలని పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. డి ఎం అండ్ హెచ్ ఓ మరియు జి జి హె చ్ సూపరిండెంట్ మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను సందర్శించి ట్రాన్స్ జెండర్స్ ఈ క్లినిక్ సేవలను వినియోగించుకోవాలని ఈ క్లినిక్ ప్రతి గురువారము ట్రాన్స్ జెండర్స్ కు వైద్య సేవలు అందిస్తుందని వివరించారు. హెచ్ఐవి ఎయిడ్స్ ర్యాలీ జి జి హె చ్ ములుగు నుండి డి ఎల్ ఆర్ ఫంక్షన్ వరకు నినాదాలతో పాటలతో ర్యాలీ నిర్వహించారు మానవహరాన్ని నిర్వహించారు

.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగనేష్ మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్పతి, ఫిజీషియన్ డాక్టర్ బిక్షపతి రావు, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధా హెల్త్ ఎడ్యుకేషన్ భాస్కర్ హెచ్ఐవి ఎయిడ్స్ కంట్రోల్ డిస్టిక్ కోఆర్డినేటర్ జ్యోతి, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, మెడికల్ కాలేజ్ విద్యార్థులు, స్టాఫ్ నర్సులు,ఆశ వర్కర్లు,సిబ్బంది, మరియు హెచ్ఐవి మీద పనిచేస్తున్న దిశ సిపిఎం జ్యోతి, ఐ సి టి సి కౌన్సిలర్లు ,స్వచంధ సంస్థలైన మారి, లింక్ వర్కర్స్ ,సంపూర్ణ సురక్ష , నెట్వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.

# నామినల్ మస్టర్ రోల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందహించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:**ఏప్రిల్ 09, 2026-నిర్మల్:-జిల్లాలో పనిచేస్తున్న నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ లో, గురువారం, ఎన్ఎంఆర్ వేజెస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా దినసరి కార్మికుల చేతనాల పెంపు గురించి చర్చించారు. 2024 - 25 సంవత్సరానికి గాను 15 శాతం, 2025 - 26 సంవత్సరానికి 10 శాతం, 2026 - 27 సంవత్సరానికి 5 శాతం వేతనాలు పెంచారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం ద్వారా వారిని గౌరవించినవారిమౌతామని కలెక్టర్ తెలిపారు. కార్మికులకు సంబంధిత వేతనములు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రాజలింగు, సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో "మన ఇసుక వాహనం" అమలు.

### ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలి.

### ఇసుక పంపిణీలో పారదర్శకతకు కట్టుదిట్టమైన చర్యలు.

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9 ములుగు** నేటి నుండి పది మండలాలలో "మన ఇసుక వాహనం" అమలుగురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, ఇందిరమ్మ ఇండ్లుకు, ప్రభుత్వ చేపట్టిన నిర్మాణ అవసరాలకు ఇసుకను కనిష్ట ధరకు అందించడమే కాకుండా, ప్రైవేటు వ్యక్తులకు ఆస్కారం లేకుండా, అత్యంత పారదర్శకంగా నేరుగా ప్రభుత్వమే ఇసుకను






వినియోగదారులకు సరఫరా చేయనుంది. ఇసుక రవాణాతో ఇబ్బందులు అధిగమించడంతో పాటు వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండ తగిన చర్యలు తీసుకోవడమైనదని జిల్లా కలెక్టరు, చైర్మన్, ఇసుక యాజమాన్య సంస్థ, ములుగు తెలుపడమైనది.

రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన "మన ఇసుక వాహనం" అమలు మన ములుగు జిల్లా లోని 10 మండలలో అందుబాటులోకి వచ్చింది. జిల్లాలోని మొట్లగూడెం, పస్రా, రాఘవపట్నం, రంగాపూర్, సోమలగడ్డ (గోవిందరావుపేట మండలంలో) గ్రామాల్లో ఇసుక రీచ్లను ఏర్పాటు చేశారు. కాతిగూడెం, రాజుపేట, మరియు బోరెనర్సాపూర్ (మంగపేట మండలంలో); బుట్టాయిగూడెం (కన్నాయిగూడెం మండలంలో): దానవాయిపేట, వెంకటాపురం (జెడ్), మరియు వడగూడెం (జెడ్) (వెంకటాపురం మండలంలో); నర్సాపూర్, పంటాపూర్, ఉరట్టం, మేడారం, బొల్లేపల్లి, రంగాపూర్, మరియు కాల్వపల్లి (ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలో); మరియు కొండాయి మరియు మానసపల్లి (ఏటూరునాగారం మండలంలో) ఇట్టి ఇసుక రీచ్ లను ఇసుకను గృతించి 'మన ఇసుక వాహనం". ఆన్ లైన్ వెబ్ సైట్ పొదుపరచడం జరిగింది.

ఇసుక కావలసిన వినియోగదారులు, ఆన్ లైన్ వెబ్ సైట్ (https://tsmiv.cgg.gov.in) నందు వారి వివరములను నమోదు చేసుకొని, కావలసిన ఘనపరిమాణానికి ఇంటర్నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ లేదా యూపీఐ ద్వారా చెల్లింపులు చేసి ఇసుకను నేరుగా ఇంటి వద్దే పొందవచ్చు. జిల్లా యంత్రాంగం ఇసుక రవాణా చేయాల్సిన దూరాన్ని బట్టి ధర నిర్ణయించినారు. ఇసుక సరఫరా సమాచారం కొరకు స్థానిక తహసిల్దార్ని సంప్రదించవచ్చునని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, డి ఆర్ డి ఓ చంద్ర శేఖర్ రెడ్డి, ఏ డి మైన్స్ జయ రాజు, పి డి హౌసింగ్ సూర్య నారాయణ, ఇర్రిగేషన్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ప్రారంభం ... జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 9 ములుగు** యాసంగి (రబీ) 2025-26 సీజన్ కలెక్టరేట్ లోని సివిల్ సప్లై కార్యాయం లో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ప్రారంభించారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి (రబీ) 2025-26 సీజన్ ప్రారంభమైన సందర్భంగా ములుగు జిల్లాలోని వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు, రైతులకు ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయం లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం, రవాణా, మద్దతు ధర ఇతర సాంకేతిక ఇబ్బందులు తలెత్తినప్పుడు రైతులకు కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందని, సమస్యల ఫిర్యాదుల కోసం 9347416178 నంబర్‌ను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా పౌరసరఫరాల శాఖ అదికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, సివిల్ సప్లై డి యం కృష్ణవేణి, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్-9 (ప్రజాబలం ప్రతినిధి)**సబ్ స్టేషన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థల పరిశీలన చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమీపంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాలను గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఎన్పీడీసీఎల్ సీఈ అశోక్ తో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కలెక్టర్ పలు సూచనలు చేశారు.పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవల్లో నూతన దశ -- మొబైల్ ఫోన్ల పంపిణీతో డిజిటల్ పురోగతి

## పోషణ్ పక్వాడ పోస్టర్ ఆవిష్కరణ



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 09:**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో ఉన్నటువంటి కూకట్ పల్లి,డిగ్రీ కళాశాల నందు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కి చెందిన అంగన్వాడి టీచర్స్ కీ మొబైల్ ఫోన్స్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా పట్నం మహేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, మాధవరం కృష్ణా రావు, శాసన సభ్యులు కూకట్ పల్లి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఫైజాన్ అహ్మద్ మరియు జిల్లా సంక్షేమ ఆధికారి శారద పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమములో అంగన్వాడి టీచర్స్ అందరికి మొబైల్ ఫోన్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగింది, మరియు ఈ నెల తేది: 09.04.2026 నుండి తేది: 23.04.2026 వరకు నిర్వహించబోయే పోషణ్ పక్వాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ని కూడ లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో సి డి పి ఓ కుత్బుల్లాపూర్, కుత్బుల్లాపూర్ సూపర్ వైజర్స్, కుత్బుల్లాపూర్ ఐ సి డి ఎస్ ఆఫీస్ స్టాఫ్ మరియు అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యలో నూతన మార్పులు

## విద్యా రంగానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి

## మేడ్చల్ జిల్లాలో విద్యా మౌలిక సదుపాయాల విస్తరణ



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 09:**రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ తదితర కళాశాలలతో పాటు పాఠశాలల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కూకట్పల్లి లో ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ. 8 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

అలాగే మేడ్చల్ జిల్లాలోని అంగన్వాడి సెంటర్ల టీచర్లకు సెల్ఫోన్లను,ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు,కలెక్టర్ మను చౌదరి కలిసి పంపిణీ చేశారు. ఇందులో

రూ.4.95 కోట్ల పీఎం ఉషా గ్రాంట్స్ నిధులతో కళాశాల జీం1 భవనం ప్రారంభించగా,

రూ. 2.84 కోట్ల డీఎంఎఫ్టీ నిధులతో జీ ం2 లో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీవీ కింద నవ గురుకుల సంస్థ ద్వారా 86 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత లాప్ టాప్ పంపిణీ తో పాటు ఏడాది పాటు శిక్షణ శిబిరం ప్రారంభించారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో చదవడం అనేది రేషన్ గా మారిన తరుణంలో గతంలో ఆలోచిస్తే

గొప్ప వాళ్ళంతా ప్రభుత్వ విద్యాలయాల్లో చదివారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు వస్తాయని మహేందర్




రెడ్డి తెలిపారు. పాఠశాల తో పాటు ఇంటర్ డిగ్రీ విద్యార్థులు కష్టపడి చదవాలని మంచి ఫలితాలు సాధించి రాష్ట్ర గౌరవ ప్రతిష్టలను దేశ వ్యాప్తం చేయాలని మహేందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు.

కూకట్పల్లి లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలకు స్థలం కోసం ముఖ్యమంత్రి కు నివేదిస్తా అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సహజసిద్ధమైన, సృజనాత్మకతతో గొప్ప వ్యక్తులుగా ఎదగాలని తెలిపారు. తాము గతంలో ఇంజనీరింగ్ ప్రస్తుతం మేడ్చల్ విద్యాసంస్థలను నిర్వహించామని కూకట్ పల్లిలో అవసరమైతే ఆ సంస్థల ద్వారా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తామని వివరించారు.

మేడ్చల్ జిల్లా కలెక్టర్మను చౌదరి మాట్లాడుతూప్రణాళిక ప్రకారం క్రమశిక్షణ తో చదవాలని,విజయాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు.

ఏఐ ని సద్వినియోగం చేసుకోవాలని తద్వారా వార్తా పత్రికలు, ప్రచార సాధనాలను తమ జీవిత లక్ష్యాల సాధన కోసం వాడుకొని రాష్ట్ర, దేశ, ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యాభ్యాసం సాగించాలన్నారు. తను ప్రభుత్వ కళాశాలలోనే చదువుతూ ఆవిష్కరణలకు ప్రయత్నించి విజయం సాధించాలని వెల్లడించారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో అభివృద్ధి కోసం తమకు మహేందర్ రెడ్డి ఎంతో సహకరించారని చెప్పారు.

కూకట్పల్లి డిగ్రీ , జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

గతంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ గా సునీత రెడ్డి, మంత్రిగా మహేందర్ రెడ్డి సహకరించినట్లుగా కళాశాల అభివృద్ధికి తాము సహకరిస్తాం.

కళాశాల ప్రిన్సిపల్ చందన మాట్లాడుతూ కళాశాలలో 1687 మంది డిగ్రీ విద్యార్థులు, 1700 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు వివరించారు. కళాశాలలో చాలామంది చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిష్ఠించారని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు టెక్నాలజీలో నైపుణ్యం సాధించాలి

## -- కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 09:**చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని అందులో నైపుణ్యతను పొంది మీ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు బోధించారు.

గురువారం కూకట్ పల్లి మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలురు) స్కూల్ మరియు జూనియర్ కాలేజీ ని సందర్శించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేసారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని, వసతి గృహంలో అందుతున్న బోధన పై ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు మీకు ఇష్టమైన స్పోర్ట్స్, గేమ్స్, మీ అభిరుచులలో కూడా మీ ప్రతిభను బయటపెట్టి అందులో కూడా మీరు రాణించేలా మీకు అవసరమైన శిక్షణను అందించడానికి



ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. మీ పై మీకు ఆత్మవిశ్వాసం ఉండాలని, బిడియాన్ని వదిలి మీకు తెలిసిన విషయాన్ని నలుగురిలో మాట్లాడగలగాలని అప్పుడు మీ పై మీకు నమ్మకం కలుగుతుందన్నారు. చదువుతో పాటు మారుతున్న టెక్నాలజీని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకొని ఎక్కువ శ్రమ పడకుండా స్మార్ట్ వర్క్ చేయాలని తద్వారా టైమ్ సేవ్ అవుతుందన్నారు. ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటి వంటి ఎఐ టూల్స్ ఎక్కువగా వినియోగించడం జరుగుతుందన్నారు. ఎఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందిందన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోండి, అవి మీ భవిష్యత్తు ప్రయత్నాలలో ఎల్లప్పుడూ తోడ్పడతాయని, ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే మీకు సబ్జెక్ట్ మీద అవగాహన ఉండాలని, సబ్జెక్ట్ అంటే కేవలం అకాడమిక్స్ మాత్రమే కాదని, ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకొని ఆ అంశం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి తహసీల్దార్ స్వామి, ప్రిన్సిపల్ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్ కోసం చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి

విజయవాడ లో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలుపై విద్యుత్, చేనేత మరియు జౌళి శాఖాధికారులతోమంత్రి సవిత గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. . ఏప్రిల్ 1వ తేదీ నుండి చేనేత మరియు పవర్ లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు: నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పవర్ లూమ్ (మగ్గం) కార్మికులకు: నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కోసం బడ్జెట్ఈ పథకం కోసం సుమారు 150 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. అర్హులైన కార్మికులు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

## తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముతినేని వీరయ్య



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 09:**తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముతినేని వీరయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కాప్రా మున్సిపాలిటీ కార్యాలయంలో వికలాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాపాలనలో భాగంగా వికలాంగుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో ఇటువంటి గ్రీవెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో సుమారు 96 మంది వికలాంగులు తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. చైర్మన్ ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విని, అర్హులైన వారి దరఖాస్తులను తక్షణమే అధికారులకు ఫార్వార్డ్ చేశారు.వికలాంగులు ప్రధానంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పెన్షన్లు, వైద్య సహాయం మరియు ఇతర మౌలిక సదుపాయాల గురించి విన్నవించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల పక్షపాతి అని కొనియాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న పలు ప్రయోజనాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు:

కళ్యాణ లక్ష్మి: ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే కళ్యాణ లక్ష్మితో పాటు అదనంగా 2 లక్షల రూపాయల ప్రోత్సాహకం.

రిజర్వేషన్లు: ఇళ్ల స్థలాల కేటాయింపులో 5% రిజర్వేషన్.

కోర్టు ఉద్యోగాలలో 4% రిజర్వేషన్.

ఉన్నత విద్యలో 5% రిజర్వేషన్.

రాజీవ్ వికాసం పథకంలో 5% రిజర్వేషన్.

క్రీడలు: వికలాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక 'పారా స్పోర్ట్స్ పాలసీ' అమలు.

ఉపకరణాలు: 40% పైన వైకల్యం ఉన్న వారికి అవసరమైన సహాయక ఉపకరణాల పంపిణీ.

పాల్గొన్న ముఖ్యులు:

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, డిప్యూటీ కమిషనర్, కాప్రా పి ఓ, సి డి పి ఓ, అల్వాల్ బి ఆర్ బి కో-ఆర్డినేటర్, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు , మరియు ఎన్ పి ఆర్ డి రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్ గారు, ట్విస్ట్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ గారు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు: వికలాంగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, వారిని ఆర్థికంగా మరియు సామాజికంగా ఆదుకుంటామని చైర్మన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# 13 నుండి 18 వరకు

# ,,ఆరైవ్ ఆ లైవ్. పగడ్బందీగా నిర్వహించాలి





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 09 04 2026**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు గురువారం హైదరాబాద్ నుండి డిజిపి శివదర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆరోగ్యం) క్రిస్టినా జోంగ్తు, సెక్రటరీ (ప్లానింగ్) గౌరవ్ ఉప్పల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సీఐపీఆర్ ప్రియాంకతో కలిసి 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన "అరైవ్ అలైవ్" కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతపై పలు చర్యలు చేపట్టినప్పటికీ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాల సంఖ్య వేగంగా పెరగడం, మెరుగైన రహదారుల కారణంగా అధిక వేగంతో వాహనాలు నడపడం, సరైన డ్రైవింగ్ శిక్షణ లోపించడం, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి కారణాలు ప్రమాదాల పెరుగుదలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అత్యవసరంగా సృజనాత్మక, స్థానిక అవసరాలకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను తరచూ నిర్వహిస్తూ 13 నుండి 18వ తేదీ వరకు వారం రోజుల. పాటు జరిగే "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల



భాగస్వామ్యం తో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ నెల 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించబడు తుందన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం, బాధ్యతాయుత డ్రైవింగ్ను ప్రోత్సహించడం లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అన్ని శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, నిరంతర అవగాహన కార్యక్రమాలు కీలకమని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. తుది లక్ష్యం ప్రజల ప్రాణాలను కాపాడటమేనని ఆయన స్పష్టంచేశారు.

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, ఇది సాధారణ కార్యక్రమం కాదని, అన్ని శాఖల సమన్వయంతో చేపడుతున్న సమగ్ర కార్యక్రమమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు బాధితులవుతున్నారని పేర్కొంటూ, వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు అవసరమని తెలిపారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో గణనీయ పురోగతి సాధించామని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి .ఎస్. మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించనున్న

కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

ఏప్రిల్ 13: గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు

ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రత ప్రమాణ స్వీకారం.

ఏప్రిల్ 15: "చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే" -- 4 సంవత్సరాల పైబడిన పిల్లలకు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన

ఏప్రిల్ 16: ప్రభుత్వ ఉద్యోగుల కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక ప్రచారం మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన

ఏప్రిల్ 17: ప్రమాదాల అనంతరం తక్షణ వైద్య సహాయం కోసం "గోల్డెన్ అవర్" శిక్షణ కార్యక్రమాలుఏప్రిల్ 18: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ కార్యక్రమాలు, ప్రవర్తనా మార్పు, ట్రాఫిక్ నియమాల పాటించడంపై దృష్టి.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసైన వృద్ధుడి ఆత్మహత్య

ఆనందపురంమద్యానికి బానిసైన ఓ వృద్ధుడు కుమారుడు డబ్బులు ఇవ్వలేదన్న మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనందపురం మండలం పరిధిలోని బోయపాలెం ప్రాంతానికి చెందిన పైలా నారాయణ స్వామి (60) గత పది సంవత్సరాలుగా నారాయణ ఉమెన్స్ కాలేజీలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారు ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పైలా రాజేష్ అనిట్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తుండగా చిన్న కుమారుడు పైలా సురేష్ వేములవలసలో నివసి స్తున్నాడు భార్య మర ణించిన తర్వాత నారాయణ స్వామి కొంతకాలంగా ఇద్దరు కుమారుల వద్ద మారు మారుగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల ఆయనకు మద్యం సేవించే అలవాటు ఎక్కువైంది ఈ నెల 7వ తేదీన వేములవలసలో నివసిస్తున్న తన చిన్న కుమారుడు సురేష్ వద్దకు వెళ్లి మద్యం కోసం డబ్బులు అడిగాడు అతిగా మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరమని భావించిన సురేష్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించాడు దీంతో మనస్తాపానికి గురైన నారాయణస్వామి గురు వారం ఉదయం ఆనంద పురం సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఉన్న మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com